

ట్రాన్స్‌'ఫార్మర్ల' కష్టాలు

వర్షాలకు కాలిపోతున్న నియంత్రికలు
మరమ్మతు చేయడంలో అంతులేని అలసత్వం

విద్యుత్ శాఖకు నిర్లక్ష్యపు జబ్బు పట్టుకుంది. వ్యవసాయ సర్వీసులు మంజూరులోనే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులోనూ ఆ శాఖ అధికారులు అంతులేని అలసత్వం ప్రదర్శిస్తున్నారు. రోజుల తరబడి ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు కోసం సమయం పడుతుండటంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ప్రధానంగా మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రైతులంతా బోర్లపైనే ఆధారపడే పంటలు సాగు చేస్తారు. అలాంటి పరిస్థితుల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మార్పుల్లో నెలకొన్న జాప్యం కారణంగా పంటలకు సకాలంలో నీరు అందించలేక రైతులు అవస్థలు పడుతున్నారు. క్షేత్రస్థాయిలోని అధికారులు, ఉద్యోగులు స్పందించకపోవడంతో రైతులే స్వయంగా ట్రాన్స్‌ఫార్మర్లను ప్రైవేటు వాహనాల్లో తీసుకొచ్చి మార్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఫలితంగా రైతులపై రవాణా చార్జీల భారం రూ.వేలల్లో ఖర్చవుతోంది.

6

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)



జోనల్ చైర్మన్‌గా సంతకం చేస్తున్న సురేష్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడుపుతా!

- వేధింపులుండవ్.. అందరం కలిసికట్టుగా పని చేద్దాం
- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం
- నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి
- అట్టహాసంగా బాధ్యతల స్వీకరణ

వివరాలు 6

ఆ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

- ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ ఆదేశం

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నాసిరకంగా పనులు చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వ్యవహారంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. దాదాపు ఎనిమిదేళ్లుగా కాంట్రాక్టర్ నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయకుండా దాచిపెట్టిన ఫైల్ బయటకొచ్చింది. 'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన ప్రభుత్వం.. సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నెల 12వ తేదీన 'ఫైలు తొక్కిపెట్టి.. రూ.కోట్లు కొల్లగొట్టి!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆత్మకూరు-సోమశిల రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతి వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) చర్యలకు ఉపక్రమించారు. నాసిరకంగా రోడ్డు పనులు జరిగినట్లు క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఈఎన్‌సీ జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల ప్రకారం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ నివేదిక ప్రకారం మళ్లీ కొత్తగా రోడ్డు వేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వనున్నట్లు ఆర్‌అండ్‌బీ నెల్లూరు ఈఈ మురళీకృష్ణ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. సదరు కాంట్రాక్టర్ రోడ్డు వేయకపోతే రికవరీకి వెళ్తారు.

మీ నిర్లక్ష్యానికి సమాధానం చెప్పండి

- డీసీ, ఎంహెచ్‌వోకు కమిషనర్ 'షోకాజ్'

నెల్లూరు(సిటీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 'విధి నిర్వహణలో మీ నిర్లక్ష్యానికి కారణమేమిటి..? లిఖితపూర్వక వివరణ ఇవ్వండి' అంటూ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సూచించారు. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎంహెచ్‌వో చైతన్య, ఆర్వో రాజేశ్వరి, ఆర్‌ఐ పద్మావతి, అడ్మిన్ సతీష్‌కు షోకాజు నోటీసులు గురువారం జారీ చేశారు. అందిన సమాచారం మేరకు... మంగళవారం ఉదయం 5.30 గంటలకు కమిషనర్ సూర్యతేజ నగరంలో పారిశుధ్య పనులను పరిశీలించను బయలుదేరారు. అయితే దారి పొడవునా ఎక్కడా పారిశుధ్య కార్మికులు రోడ్లమీద విధుల్లో కనిపించలేదు. ఆశ్చర్యం వ్యక్తం చేసిన ఆయన వెంటనే ఎంహెచ్‌వోకి ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. ఈ తంతు గంటకు పైగా సాగింది. అయిన ఎంహెచ్‌వో అందుబాటులోకి రాకపోవడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి ఎంహెచ్‌వోకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రెండు రోజుల క్రితం భవన నిర్మాణాలను పరిశీలిస్తూ కమిషనర్ సూర్యతేజ చిల్డ్రన్స్‌పార్కు వద్దనున్న ఓ ఆసుపత్రికి వెళ్లారు. ఆ భవనానికి ఆస్తిపన్ను లేకపోవడంతో ఆశ్యర్యం వ్యక్తం చేసి రెవెన్యూ విభాగంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిర్లక్ష్యానికి వివరణ కోరుతూ డీసీ చెన్నుడు, ఆర్వో రాజేశ్వరి, ఆర్‌ఐ పద్మావతి, స్థానిక సచివాలయ అడ్మిన్ సతీష్‌కు షోకాజు జారీ చేశారు.

- భూముల రీసర్వే పేరుతో హద్దురాళ్లు
- జగన్ బొమ్మ, పేరుతో రూపకల్పన
- అన్నదాతల అభ్యంతరం, ఆందోళన
- వాటిని చెరిపేందుకు ఖర్చు రూ.59 లక్షలు
- నాటి ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం



శాండ్‌పేపరు యంత్రంతో సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరు తుడిపేస్తున్న కూలీలు

నాటి పాపాలు

నేడు తుడిపేస్తూ..

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల నాటి భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమంటూ గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వే... రెవెన్యూ, సర్వేశాఖలకు తలనొప్పిగా మారింది. రీసర్వేకు ప్రజాధనాన్ని వెచ్చించిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రక్రియను జగన్ నామస్మరణకు వాడుకుంది. డ్రోన్‌ల ద్వారా ఈ సర్వే జరిగింది. ఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) దగ్గర నుంచి సర్వే పూర్తయిందని తెలిపే 13వ నోటిఫికేషన్ జారీ వరకు జిల్లాలో అన్నీ తప్పులే జరిగాయి. తక్కువ సమయంలో పూర్తి చేయాలంటూ నాటి ప్రభుత్వం ఒత్తిడి తేవటంతో రీసర్వే అవకతవకలుగా కొనసాగింది. రైతుల నుంచి అభ్యంతరాలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

● జగన్ పేరుతో రాళ్లు

రీసర్వేతో సరిపెట్టకుండా సర్వే రాళ్లపై, పట్టాదారు పాస్‌పుస్తకాలపై జగన్ బొమ్మ, పేరును వైసీపీ ప్రభుత్వం ముద్రించింది. తాము చేసిందే సర్వే, తన బొమ్మతో ఉన్న పాస్‌పుస్తకమే రాజపత్రం, తన పేరుతో వేసిన సరిహద్దు రాళ్లే కొలతలకు గీటురాళ్లు... అన్న చందంగా నాడు వ్యవహరించారు. ఏ దశలో కూడా నిబంధనలు పాటించ లేదు. రీసర్వే చేసిన తరువాత సర్వేరాళ్లు వేయడానికి వైసీపీ పాలకులు భారీగా ప్రజాధనం వెచ్చించారు. వీటివల్ల రైతులకు మేలు జరుగుతుందా? లేదా అనే విషయాన్ని పట్టించుకో కుండా జగన్ పేరుతో ఉన్న రాళ్లను రైతుపొలంలో ఉండి తీరాల్సిందే అన్న ధోరణిలో వ్యవహరించారు. జగన్ పేరుతో సర్వేరాళ్లు వద్దంటూ రైతులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది.

● కూటమి ప్రభుత్వం హామీ

తాము అధికారంలోకి వచ్చాక జగన్ బొమ్మతో ఇచ్చిన పాసుపుస్తకాలు రద్దు చేసి, సర్వేరాళ్లపై బొమ్మలు తొలగిస్తామని ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ ప్రకారం జగన్ బొమ్మలు, పేర్లు తొలగించేలా గత నెల 16వ తేదీన ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాళ్ల దెబ్బ తినకుండా శాండ్ పేప రు, యంత్రాలతో జగన్ వివరాలను తొలగిం చాలని నిర్ణయించింది. ఇందుకోసం ఇప్పటికే అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో బృందం రోజుకు 200 రాళ్ల వంతున పేర్లు తుడిపేసేలా ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 3,97,584 రాళ్ల పాతగా, ఇప్పటివరకు 6,384 రాళ్లపై పేర్లు తొలగించారు. పొలాల్లో నాట కుండా నిరుపయోగంగా ఉన్న రాళ్లపై కూడా పేర్లు తుడిపేస్తున్నారు. ఈ తుడిపి వేతకు ఒక్కో రాయికి రూ.15 చొప్పున ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ ప్రక్రియను డిసెం బరు 31వ తేదీలోపు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారు.

సర్వే జరిగిన గ్రామాలు	: 328
నాటిన రాళ్లు	: 3,97,584
ఒక్కో రాయి ఖర్చు	: రూ.180
మొత్తం ఖర్చు	: రూ.7,15,65,120
ఇప్పటివరకు పేర్లు తుడిపిన రాళ్లు	: 6,384
ఒక్కో రాయికి ఖర్చు	: రూ.15
మొత్తం	: రూ.59,63,760
ఇప్పటివరకు తుడిపినది	: 6,384
గడువు తేదీ	: డిసెంబరు 31

వేగంగా పేర్ల చెరిపివేత



జిల్లాలో సర్వే హద్దురాళ్లపై పేర్లు చెరిపివేసే కార్యక్రమాన్ని వేగంగా చేయిస్తున్నాం. జగన్ బొమ్మ, పేరు చెరిపివేత సందర్భంలో రాళ్లు దెబ్బతినకుండా శాండ్ పేపరుతో జాగ్రత్తగా తుడిపివేయిస్తున్నాం. ఈ ప్రక్రియను త్వరలో పూర్తి చేయిస్తాం.

- నాగశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్, సర్వే భూరికార్డులశాఖ



ఉదయగిరి రూరల్ : సర్వే రాయిపై బొమ్మ, పేర్లను తొలగిస్తున్న సిబ్బంది

● ఒక్కోరాయి రూ.180పైగానే..

సర్వే చేసిన పొలాల్లో పాతే రాళ్లపై కూడా నాటి సర్కారు భారీగా ఖర్చు చేసింది. ఒక్కో రాయికి రూ.180కిపైగా ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో భారీగా అవకతవకలు జరిగి రూ.కోట్లు చేతులు మారినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి.

● నాటిన రాళ్లు 3.97 లక్షలు

జిల్లాలోని 328 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన ఈ గ్రామాల్లో 3,97,584 రాళ్లను నాటారు. చాలా రాళ్లు పాతకుండా నిరుపయోగంగా ఉన్నాయి. ఉలవపాడు మండలం మన్నేటి కోటలో వృథాగా ఉన్న ఎన్నో రాళ్లు కనిస్తున్నాయి.

గ్రామాల్లో డిజిటలైజేషన్

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని గ్రామాలన్నీ ఇకపై పూర్తిగా డిజిటలైజ్ కానున్నాయి. ఇప్పటి వరకు ఫైళ్లు, పరిపాలన పరమైన అంశాలను మాత్రమే ప్రభుత్వం డిజిటలైజేషన్ చేయగా, కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వంలో నిధుల లేమితో అభివృద్ధిలేక పూర్తిగా గాడితప్పిన పంచాయతీ పాలనను గాడిన పెట్టడమేకాక డిజటలైజేషన్ ద్వారా పూర్తి సమాచారం ప్రజలు ఎప్పుడైనా, ఎక్కడైనా తెలుసుకు నేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారులు ప్రతి గ్రామాన్ని డిజటలైజేషన్ పరిధిలోకి తెచ్చే కసరత్తును ప్రారంభించారు.



డిజిటలైజేషన్ పనులు చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు

● స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్

గ్రామాల్లో పాలనాపరమైన అంశాలే కాకుండా, ఆ గ్రామానికి సంబంధించిన సమస్త సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్వర్ణగ్రామ పంచాయతీ యాప్‌ను ఏర్పాటు చేసింది. దీంతో ప్రతి గ్రామ వివరాలు అందులో పొందుపరి చేలా ప్రక్రియను అధికారులు ప్రారంభించారు.

జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా, వాటి పరిధి లో 1938 గ్రామాలున్నాయి. వీటన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నారు. గ్రామ పంచాయతీ సర్పంచు, పాలకవర్గ సభ్యులు, ఆ పంచాయతీలో ఉన్న గ్రామాలు, ఆ గ్రామాల విస్తీ ర్ణం, గృహాలు, జనాభా, మౌలిక సదుపా యాలు, కొళాయిలు, ఇంటిపన్నులు... ఇలా గ్రామానికి సంబంధించిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో పొందుపరు స్తు న్నారు. గ్రామాలకు వచ్చే నిధులు, చేపడుతున్న పనుల వివరాలను సైతం ఆన్‌లైన్ చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలకు సంబంధించి పూర్తి వివరాలు యాప్‌లో ఉండనున్నాయన్నారు. ఆ పనులను ఈనెలాఖరుకల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది ఈ పనులను వేగంగా చేస్తున్నారు.

జడ్పీ సీఈవో బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (జడ్పీ), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈవో)గా విద్యారమ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఈవోగా పనిచేసిన ఖాదర్‌బాషా విధులు నిర్వహించలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయిన విషయం విదితమే. దీంతో ఆయన్ను బదిలీచేసిన ప్రభుత్వం జిల్లాకు కొత్త సీఈవోగా విద్యారమను నియమిం చింది. ఆమె బాధ్యతల స్వీకరణ అనంతరం జడ్పీ చైర్ పర్సన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సీఈవోకు జడ్పీ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.



జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో సీఈవో విద్యారమ

నిబద్ధతతో పని చేయాలి

నెల్లూరు(విద్య), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయడమే కాక ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఆ శాఖ ఆర్జేడీ లింగే శ్వరరెడ్డి ఆదేశించారు. నెల్లూరు లోని రావూస్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఉన్నతాశయంతో విద్యాశాఖలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపార్ నమోదును వేగవంతం చేయాలని, ఏదైనా సమస్య లుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఎఫ్‌ఏ-1, 2 పరీక్షల మార్కుల ఎంట్రీలను కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ప్రమాణాలు తక్కువ ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారిని ప్రధాన పరీక్షలకు సంసిద్ధులను చేయాలని దిశా నిర్దేశం చేశారు. పీఎంశ్రీ స్కూల్స్‌కు వంద శాతం నిదులు వినియోగించాలని, పాల్ ల్యాబ్‌ను విద్యార్థులు నిత్యం గంటసేపు వినియోగించేలా చర్యలు తీసుకోవాల న్నారు. మధ్యాహ్న భోజనం సమయానికి సమీపంలోని అధికారులు కచ్చితంగా పాఠశాలలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు, సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి, డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎస్ఏ ఈఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి



హెచ్చరిక బ్యానర్ చూపుతున్న రెవెన్యూ అధికారులు

పన్ను చెల్లింపునకు 3 రోజులే టైం

నగరంలో అనేక మంది ఖాళీ స్థలాలకు పన్ను చెల్లించనందున కార్పొరేషన్ అధికారులు వారికి వినూత్న రీతిలో హెచ్చరికలు పంపుతున్నారు. ఇందులో భాగంగా 47వ డివిజన్ 3వ సచివాలయం పరిధిలోని ములుముడి బస్టాండ్ వద్ద ఓ ఖాళీ స్థలానికి పన్ను వేయించుకోవాలని గురువారం బ్యానర్ పట్టుకుని వినూత్న రీతిలో సదరు యజమానికి హెచ్చరికలు పంపారు. స్థలం ముందు హెచ్చరికలతో కూడిన బ్యానర్ పట్టుకుని ఆర్‌ఐ, రెవెన్యూ సిబ్బంది నిలబడిఉండటం అందరిని ఆకర్షించింది. ఇవాల్టి నుంచి మూడు రోజుల్లో స్థల పత్రాలు తీసుకువచ్చి పన్ను వేయించుకోకపోతే పురపాలక చట్టాన్ని ప్రయోగిస్తామని హెచ్చరించారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

వచ్చేనెల 5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

నెల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా పడ్డ సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ తిరిగి డిసెంబరు 5వ తేదీ ప్రారంభం కానుంది. 5వ తేదీన డబ్ల్యూఏలతోపాటు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎలక్షన్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. 8వ తేదీన డబ్ల్యూఏ (సాగునీటి సంఘాలు)లకు ఎన్నికలు జరుగుతాయి. అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఆ రోజే ఎన్నుకుంటారు. డిసెంబరు 11వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు, 14వ తేదీన ప్రాజెక్టు కమిటీల ఎన్నికతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ముగుస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం రివైజ్డ్ షెడ్యూల్‌ను ప్రకటించింది.

పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ టీకా వేయించాలి

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాడి రైతులు 4 నుంచి 8 నెలల వయసులోపు పెయ్యదూడలకు తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకా వేయించాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. పశుసంవర్ధకశాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువ్యాధి నియంత్రణ పథకం లో భాగంగా గురువారం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం పోస్టరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రూసెల్లోసిస్ వ్యాధికి చికిత్స లేదని నివారణ ఒక్కటే మార్గమని పాడిరైతులు గుర్తుంచుకోవాలని సూచించారు. ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా టీకాలు వేస్తారని, రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కే రమేష్‌నాయక్, డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ యం.నాగమణి, టీ సోమయ్య, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ డాక్టర్ చైతన్యకిషోర్ తదితరులు పాల్గొన్నారు.





వంతెనపై రైలు వెళుతుండటంతో ఆగిన వాహనాలు

ఈ కంపు నుంచి విముక్తి ఎన్నటికో!?

హరనాథపురం-వీఆర్సీ మధ్య ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రయాణం అంటే చాలు నగరవాసులు హడలిపోతున్నారు. మురుగునీరంతా బ్రిడ్జి దిగువ నిలబడిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. అంతేగాక బ్రిడ్జిపై రైలుపట్టాల కింద ఎటువంటి స్లాబు వేయలేదు. దీంతో రైలు వెళ్లే సమయంలో ప్రయాణికుల మలం, మూత్రం నేరుగా కింద పడుతుంది. అవి మీద పడకుండా రైలు వెళ్లే సమయంలో పాదచారులు, వాహనదారులు బ్రిడ్జిక అటుఇటు ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీటి సమస్యతోపాటు రైలు పట్టాల కింద కాంక్రీట్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు.



మురుగు మీద పడకుండా...





బ్రిడ్జిలో వస్తున్న మురుగు నీరు

అబ్బా.. ఈ కంపు భరించలేం!



అనాథలు, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఐకేర్‌మిషన్ సభ్యులు

అంధుల్లో వెలుగులు నింపుతూ

అభాగ్యులను ఆదుకుంటూ..

- చిన్న అనుభవం పెద్ద ఆలోచనకు దర్పణం
- తెలుగురాష్ట్రాలతోపాటు పొరుగు రాష్ట్రాల్లోనూ 'ఐకేర్ మిషన్' సేవలు

చీకటితో వెలుగే చెప్పెను నేమున్నాననీ..
ఓటమితో గెలుపే చెప్పెను నేమున్నాననీ...
నేమున్నాననీ... నీకేం కాదనీ...

అంటూ ఓ సినీ గేయ రచయిత రాసిన పాటకు సిసలైన అర్థం చెబుతూ వెలకట్టలేని సేవా కార్యక్రమాలు చేస్తూ అంధులు, అభాగ్యులు, అనాథల జీవితాల్లో వెలుగులు నింపుతోంది ఐకేర్ మిషన్. 17 ఏళ్ల క్రితం ఓ విద్యార్థి మదిలో మెదిలిన ఆలోచనతో మొగ్గ తొడిగిన ఈ సేవా సంస్థ ప్రస్తుతం పలువురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఉద్యోగాలు, వ్యాపారాలలో స్థిరపడ్డ 500మందికిపైగా సభ్యుల ఔదార్యంతో నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. జిల్లాలో మొదలైన సేవలను రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలకూ విస్తరించి ఖర్చుకు వెనకాడకుండా పేదలకు సేవలందిస్తోంది.

- జలదంకి (ఆంధ్రజ్యోతి)

మండల కేంద్రమైన జలదంకికి చెందిన వడ్డే శ్రీనాథ్ రెడ్డి ఐకేర్ మిషన్ ఆవిర్భావానికి ఆద్యుడు. నెల్లూరులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న రోజుల్లో ఓ రోజు నెల్లూరు బస్టాండులో శ్రీనాథ్‌రెడ్డి ఉండగా ఓ అంధ బాలుడు 'సార్ మీ కళ్ళు ఓసారి ఇస్తారా?' అని అమాయకంగా అడిగాడు. ఆ బాలుడిని నిరుత్సాహ పరచకుండా ఎందుకు? అని ఎదురు ప్రశ్నించారు. ఇందుకు ఆ బాలుడు బదులిస్తూ 'మా అమ్మ నన్ను ఎర్రోడా..' అని పిలుస్తోంది. ఆ ఎరుపు ఎలా ఉంటుందో చూడా లని ఉంది సార్ అని అడి గాడు ఆ అంధ బాలుడు. బాలుడి సమా ధానం విన్న శ్రీనాథ్‌రెడ్డి మనసు చలించింది. అప్పుడు ఆయన మదిలో ఒక ఆలోచన వచ్చింది. ఆ అంధ విద్యార్థితోపాటు తన లాంటి అంధులకు కంటి చూపు ప్రసాదించడానికి తాను ఏదైనా చేయాలను కున్నాడు. వెంటనే జరిగిన విషయాన్ని తన మిత్రులు దినేష్, భరత్, ప్రశాంత్, సాజిద్, ప్రభాకర్, సాయిచందులతో పంచుకుని తన ఆలోచననూ వివరించారు. వారు కూడా ఇందుకు సమ్మతించి, చేతులు కలిపారు.



సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ నుంచి అవార్డు అందుకుంటూ..

17 ఏళ్ల క్రితం

2007, డిసెంబరు 18న ఐకేర్‌మిషన్ పేరుతో సేవా సంస్థను ప్రారంభించారు. చదువుకుంటూనే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన శ్రీనాథ్ రెడ్డి ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగంలో ఉన్నారు. ఈయన స్నేహితులు కూడా ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. మిత్రులందరూ ఐకేర్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను పలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. ఈ సేవలను చూసి మరికొందరు ఉద్యోగులు, వ్యాపారులు సభ్యులుగా చేరారు. అలా ప్రస్తుతం ఐకేర్ మిషన్‌లో 500మందికిపైగా సభ్యులు ఉన్నారు. వీరంతా ప్రతి నెలా వారి సంపాదనలో 5, 10 శాతం సంస్థ చేపట్టే సేవా కార్యక్రమాలకు కేటాయిస్తున్నారు. మరికొందరు పరోక్షంగా ఈ సంస్థ కార్యకలాపాలకు సహకరిస్తున్నారు.



అంధ విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తూ..

సేవా కార్యక్రమాలు ఇవే

అంధుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఆవిర్భవించిన ఐకేర్ మిషన్ ఆధ్వర్యంలో తరచూ నేత్రదానంపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలలో చైతన్యం తీసుకొస్తున్నారు. అలా ఇప్పటి వరకు 400 మంది చేత నేత్రదానం చేసేందుకు అంగీకార పత్రంపై సంతకాలు తీసుకున్నారు.

- సంస్థ 17 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనేక మంది అంధులకు కంటిచూపు ప్రసాదించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు.
- దొరవారిసత్రంలో అంధులైన అన్నదమ్ములకు ఆర్థిక సాయం కొనసాగిస్తున్నారు.
- పాఠశాలల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటిఅద్దాలు పంపిణీ చేస్తున్నారు.
- అనంతపురం జిల్లాకు చెందిన బి.పద్మజ అనే మహిళకు కిడ్నీ, లివర్ వైద్యం కోసం రూ.2.05 లక్షలు ఆర్థికసాయం అందించారు. గుండెవ్యాధితో బాధపడుతున్న మహిళ రోషిణికి రూ.50వేలు అందజేశారు.
- 2017, ఫిబ్రవరిలో నెల్లూరుకు చెందిన ఎనిమిదేళ్ల బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేల నగదు అందజేశారు.
- జలదంకి గిరిజన కాలనీలోని ఇద్దరు అనాథపిల్లలకు ప్రతి ఏడాది రూ.10 వేల వంతున విద్యా అవసరాలకు సాయం అందజేస్తున్నారు. వారికి 18 ఏళ్ళు నిండేవరకు ఈ సాయం కొనసాగుతుందని సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. వీరికేగాక గ్రామాలలోని అనాథ పిల్లలను గుర్తించి, చదివిస్తున్నారు.
- అనాథలు, అంధులకు ఖర్చుల నిమిత్తం నగదు చెక్కులు అందజేశారు.
- పేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం విద్యా పరికరాలు అందజేస్తున్నారు.
- పోలియో వ్యాధి సోకి నడవలేని స్థితిలో ఉన్న చిన్నారులకు మూడు చక్రాల కుర్చీలు అందించారు.
- కావలి, నెల్లూరు, జలదంకి తదితర పట్టణాలు, గ్రామాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆపదలో ఉన్నవారికి అవసరమైన రక్తాన్ని అందిస్తున్నారు.
- ఈ సంస్థ సేవలను గుర్తించి 2014లో అప్పటి కలెక్టర్ శ్రీకాంత్ సంస్థ వ్యవస్థాపకుడు శ్రీనాథ్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేశారు.
- వర్ష, చలికాలాలలో రోడ్లపక్కన రాత్రిపూట దుకాణాల మెట్లపైన నిద్రించే యాచకులు, అనాథలు, అభాగ్యులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు.
- గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు నేత్రదానం, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నరసింహన్ నుంచి ఉత్తమ రక్తసేకరణ అవార్డు అందుకుంటున్న శ్రీనాథ్‌రెడ్డి

మా సేవలను మరింత విస్తరిస్తాం

17 ఏళ్ల క్రితం నెల్లూరులో మొదలైన ఐకేర్‌మిషన్ సేవలు కర్నూలు, హైదరాబాద్, చిత్తూరు, బెంగళూరు, పూణె, కోల్‌కతా తదితర మహా నగరాలకు విస్తరింపజేసి అక్కడి అంధులు, అనాథలు, నిరుపేదలకు సేవ చేస్తున్నాం. దేశవ్యాప్తంగా అనేక మంది అంధులకు నేత్రదానాలు చేసి చూపు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. అనాథలకు, నిరుపేదలు, పేద విద్యార్థుల సంక్షేమానికి ఖర్చుకు వెనకాడకుండా మా సంస్థ సభ్యులంతా ముందుకు వస్తున్నారు. భవిష్యత్తులో మా ఐకేర్ మిషన్ సేవలను మరింత విస్తరించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

- వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, ఐకేర్ మిషన్ వ్యవస్థాపకుడు

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి



నూతన బస్సులను ప్రారంభిస్తున్న సురేష్ రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల సహకారంతో ప్రజా రవాణా వ్యవస్థ పటిష్టతను పెంచేలా కృషి చేస్తామని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యమని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన జోనల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులపై ఎలాంటి వేధింపులు, కక్ష సాధింపు చర్యలు ఉండవని, అందరం కలిసి ఆర్టీసీ పటిష్టతను పెంచాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లలో ఆర్టీసీని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. రోడ్లపై భారీ గుంతలతో బస్సులు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ సురేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో వేలాది మంది పాల్గొనడం చూస్తుంటే ప్రజల్లో ఆయనకున్న ఆదరణ స్పష్టమవుతోందన్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సురేష్‌రెడ్డితో సోదర భావంతో మెలిగానని చెప్పారు. కాగా, సురేష్ రెడ్డి బాధ్యతల స్వీకరణ సందర్భంగా వీఆర్సీ సెంటర్ నుంచి బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం నెల్లూరు డివిజన్‌కు కేటాయించిన ఐదు కొత్త బస్సులను సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు సురేంద్రరెడ్డి, అంజనేయులురెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, మిడతల రమేష్, డిప్యూటీ మేయర్ రూపుకుమార్ యాదవ్, జనసేన నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరోజు వస్తే ఒట్టు!

- గుండ్లపాళెం సచివాలయంలో కానరాని వీఆర్వో



నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయ పరిధిలోని గుండ్లపాళెంలో ఉన్న 17/3 సచివాలయం వీఆర్వో ఒక్క రోజు కూడా విధులకు హాజరు కావడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయానికి రాకపోవడమేకాదు కనీసం ఫోన్‌లోనూ అందుబాటులో ఉండరనే విమర్శ ఉంది. గురువారం మధ్యాహ్నం కూడా సచివా లయంలో ఆయన కుర్చీ ఖాళీగా దర్శనమివ్వడం గమనార్హం. ఆ వీఆర్వో తీరుతో తమ పనులు ఒక్కటీ కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మండల కార్యాలయంలో ఫిర్యాదు చేయగా కలెక్టరేట్‌లో చెప్పాలని అక్కడి అధికారులు సలహా ఇచ్చారంటున్నారు. ఈ విషయమై తహసీల్దారు లాజరస్‌ను వివరణ కోరగా తాను విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని తెలిపారు. సదరు వీఆర్వో ప్రోటోకాల్ డ్యూటీలో ఉన్నట్లు వివరించారు.

ట్రాన్స్‘ఫార్మర్ల’ కష్టాలు

- వర్షాలకు కాలిపోతున్న నియంత్రికలు
- మరమ్మతు చేయడంలో అంతులేని అలసత్వం
- రోజుల తరబడి ఎదురుచూపులు
- నీరందక ఎండిపోతున్న పైరు
- రైతులపై రవాణా భారం



ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉదయగిరి మండలం వీరారెడ్డిపల్లి రైతులకు సంబంధించినది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద జొన్న పంట సాగులో ఉంది. అయితే, నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురవడంతో పైరు ఎండిపోతోంది. నెల రోజులుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని రైతులు వాపోయారు.

ఉదయగిరి మండలంలోని గండిపాళెం, గుడినరవ, వెంకట్రావుపల్లి గ్రామాల్లో ఇటీవల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ఆయా గ్రామాల రైతులు పంటలు ఎండిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతు చేయాలని అధికారుల చుట్టూ పలుమార్లు తిరిగాక మరమ్మతులు చేసి ఇచ్చారు. ఇందుకుగాను ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రవాణా, ఇతర ఖర్చులు కలిపి రూ.8 వేల నుంచి 10 వేలు ఖర్చయినట్లు రైతులు తెలిపారు.

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చుకునేందుకు రైతులు, వినియోగదారుల ఇబ్బందులు వర్ణనాతీతం. సాధారణంగా ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైతే పట్టణాల్లో 24 గంటలు, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో మరొకటి ఏర్పాటు చేయాలి. అయితే, క్షేత్రస్థాయిలో అధికారులు, ఉద్యోగులు ఆ దిశగా స్పందించడంలేదన్న విమర్శలు ఉన్నాయి. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రోజుల తరబడి మార్చడంలేదని రైతులు వాపోతున్నారు.

కాలిపోతున్నాయ్!

ఇటీవల కురిసిన వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు వందల సంఖ్యలో కాలిపోయాయి. ఒక్క ఉదయగిరి సబ్ డివిజన్‌లోని సుమారు 120 ట్రాన్స్‌ఫార్మర్లు దగ్ధమయ్యాయి. ఇక ఆత్మకూరు, కావలి సబ్, కలిగిరి సబ్ డివిజన్లలో చెప్పాల్సిన అవసరం లేదు. ఆయా డివిజన్ల రైతులు సమస్యను ఇటీవల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. ఆయన ఉన్నతాధికారులతో చర్చించి ఇతర జిల్లాల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు తెప్పించినా సమస్య పరిష్కారం కావడంలేదు.

ఉదయగిరి, ఆత్మకూరు సబ్ డివిజన్లకు కలిపి ఆత్మకూరు పట్టణం, నెల్లూరు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం ఉంది. ఇక్కడ రోజుకు 3-4 ట్రాన్స్‌ఫార్మర్లకే మరమ్మతులు చేసే వీలుంది. దీంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేసినా మరలా కాలిపోతుండటంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ల కింద సాగులో ఉన్న పంటలు నీరు లేక ఎండుముఖం పడుతుండటంతో రైతులు సంబంధిత అధికారులు, కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఖర్చులు తడిసిమోపెడు

విద్యుత్ శాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను రైతులే సొంత నగదు పెట్టుకుని మరమ్మతు కేంద్రాలకు తరలిస్తున్నారు. మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను తరలించేందుకు ప్రతి డివిజన్‌లో ప్రత్యేక వాహనం ఉండాలి. ఆ వాహనాల్లో విద్యుత్ సిబ్బంది తీసుకొచ్చి, వాటి స్థానంలో మరొకటి ఏర్పాటు చేయాలి. అయితే ఉదయగిరి సబ్ డివిజన్‌కు వాహనం లేదు. దీంతో రైతులే ట్రాక్టర్లు, ప్రైవేటు వాహనాల్లో ఆత్మకూరుకు ట్రాన్స్‌ఫార్మర్లను తరలిస్తున్నారు. దీంతో రైతులకు రవాణా, ఇతరత్రా ఖర్చులు కలిపి సుమారు ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.10వేల నుంచి 15 వేల వరకు ఖర్చు అవుతోంది. గతంలో సబ్ డివిజన్ కేంద్రంలో అదనంగా 10-20 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేవి. కాలిపోయిన వెంటనే మార్పు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయింది.



మరమ్మతులు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాక్టర్‌లో తీసుకెళుతున్న శకునాలపల్లి రైతులు

త్వరలో సమస్యను పరిష్కరిస్తాం

వర్షాల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోయాయి. నెల్లూరుపాళెంలో ఉన్న మరమ్మతుల కేంద్రంలో రోజుకు 3-4 మాత్రమే మరమ్మతులు చేస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం. ట్రాన్స్‌ఫార్మర్ల కొరత దృష్ట్యా వారు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 40 ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకొచ్చారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కారమవుతోంది.

- ఐ.శ్రీనివాసులు, ట్రాన్స్‌కో డీఈ, ఆత్మకూరు

నెల రోజులుగా తిరుగుతున్నా



మా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నెల రోజుల క్రితం కాలిపోయింది. నీరు అందక జొన్న, వరి పంట లు ఎండిపో తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి ఇవ్వండని కరెంటు అధికారుల చుట్టూ నెలరోజులుగా తిరుగుతున్నా పట్టించుకొనేవారే కరువయ్యారు.

- లక్కు శ్రీనివాసులరెడ్డి, రైతు, వీరారెడ్డిపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వాటిని మార్చాలని అధికారుల చుట్టూ నెలరోజులుగా ప్రదక్షిణలు చేయగా మంజూరు చేశారు. ఈ లోపు సాగులో ఉన్న పంట ఎండుముఖం పట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలి.

- ఎన్.తిమ్మయ్య, రైతు, శకునాలపల్లి

గంధోత్సవంలో నటుడు సుమన్

వెంకటాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కసుమూరు కొండపై ఉన్న సయ్యద్ జిందా మదార్ అలీషా ఖలందర్‌బాబా గంధమహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సినీనటుడు సుమన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



గంధమహోత్సవానికి హాజరైన సినీనటుడు సుమన్



నిండా అల్లుకున్న నిర్లక్ష్యం

టీపీ గూడూరు మండలం ఈదూరు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఎదురుగా విద్యుత్ తీగలకు పిచ్చి మొక్కలు అల్లుకుపోయాయి. అటువైపు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల నుంచి ఇలా పిచ్చి మొక్కలు అల్లుకుని ఉన్నా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వీటిని తొలగించాల్సి ఉంది.

- తోటపల్లిగూడూరు, (ఆంధ్రజ్యోతి)

జరభద్రం గురూ..



మండలంలోని విరువూరు, తిమ్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలోని ప్రధాన రహదారులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మోకాలి లోతు గుంతల్లో ప్రయాణాలు సాగించాలంటే వాహనదారులు హడలెత్తిపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాల పుణ్యమా అని నీరు నిలిచిన ఆ గుంతల లోతు తెలియక అటుగా వెళ్లిన వాహనదారులు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరిన్ని ప్రమాదాలు జరుగక ముందే మరమ్మతు పనులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

- పరికుంటపాడు (ఆంధ్రజ్యోతి)

పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలి

- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో జేసీ కార్తిక్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కార్తిక్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు అన్నీ శాఖల సహకారం అవసరమని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని శంకరన్ భవనంలో గురువారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాకు ప్రత్యేకంగా మంజూరైన క్లస్టర్ల సమస్యలపై దృష్టి సారించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన పథకం ద్వారా గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ నెల 29 నుంచి జిల్లాలో ఎంఎస్‌ఎంఈ సర్వే నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జీఎం ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్‌ఎం వీరశేఖరరెడ్డి, డీజెడ్‌ఎం వెంకటసురేష్, ఆర్డీవో అనూష, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

పర్సు పోగొట్టుకున్న మహిళ

- డ్యూటీలో ఉన్న హోమ్‌గార్డుల గుర్తింపు
- సీఐ సమక్షంలో బాధితురాలికి అప్పగింత



మహిళకు పర్సు అందజేస్తున్న సీఐ, హోమ్‌గార్డులు

కావలి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తుఫాన్‌నగర్‌కు చెందిన గుర్రాల లక్ష్మీదేవి గురువారం పోగొట్టుకున్న పర్సును 2వ పట్టణ పోలీసులు ఆమెకు అప్పగించారు. ఆ వివరాల మేరకు.. లక్ష్మీదేవి తన హ్యాండ్ పర్సుతో బజారుకు వెళ్తూ ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో పోగొట్టుకుంది. అక్కడ ట్రాఫిక్ డ్యూటీ చేస్తున్న హోమ్‌గార్డులు మధు, ఎస్‌కె. మునీర్‌లు రోడ్డుపై పడి ఉన్న పర్సును గుర్తించారు. అందులో రూ.2వేలు, ఇంటి తాళాలతో పాటు 3గ్రాముల బంగారు కమ్మలు, 5గ్రాముల వెండి చైను ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆ పర్సును రెండో పట్టణ సీఐ బాధిగిరి బాబుకు అందజేశారు. కొంతసేపటి తరువాత తన పర్సుపోయినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయటానికి స్టేషన్‌కు వచ్చింది. అందులో ఉన్న వస్తువుల గురించి సీఐ ఆరా తీసి ఆమెదే అని నిర్ధారించి హోమ్ గార్డుల సమక్షంలో మహిళకు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ హోమ్ గార్డులను అభినందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

నెల్లూరు(క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు కారణాలతో వేరు వేరు ప్రాంతాల్లోని ఇద్దరు అదృశ్యమైన ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సత్యనారాయణపురానికి చెందిన బీ సుబ్బమ్మ మతిస్థిమితం లేక బాధ పడుతోంది. ఈనెల 20వతేదీ ఇంటి నుంచి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, జీనిగలవారి వీధికి చెందిన భానుచందర్ ఈనెల 19వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని భార్య స్వప్న నవాబుపేట పోలీసుల కు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషా గురువారం తెలిపారు.

శంకర మఠంలో చోరీ

నెల్లూరు(క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెలూరు మూలాపేటలోని శంకర మఠంలో చోరీ జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... ఈనెల 19వతేదీ అర్ధరాత్రి సుమారు 1 గంట సమయంలో గుర్తు తెలియని దుండగుడు మఠం గోడ దూకి లోనికి ప్రవేశించాడు. మఠంలోని సుబ్రహ్మణ్య స్వామి శూలం, ఆకాశ దీపం, పంచలోహ కలిశాలు, నగదు పెట్టె, ఫోకస్ లైట్లను అపహరించుకుని వెళ్లాడు. ఈ ఘటనపై శంకర మఠం మేనేజర్ ఉషా కుమార్ బుధవారం రాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మఠంలోని సీసీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. నెల్లూరు సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని చంద్రమౌళి నగర్‌లో వీ సురేంద్ర (45), సృజన దంపతులు నివసిస్తున్నారు. వారికి ముగ్గురు సంతానం. సురేంద్ర ఆటో నగర్‌లో మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 18వతేదీ రాత్రి పొదలకూరు రోడ్డు వైపు నుంచి ద్విచక్రవాహనంపై వెళుతూ కేన్సర్ వైద్యశాల సమీపంలో బర్రెను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆతనికి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు నగరంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. భార్య సృజన ఫిర్యాదు మేరకు సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మాసిస్టు దుర్మరణం

మనుబోలు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అప్పయ్యగేటు సమీపంలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఫార్మాసిస్టు సన్నారెడ్డి పవన్‌సాయిరెడ్డి (21) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు, ధనలక్ష్మీపురానికి చెందిన పవన్‌సాయిరెడ్డి గూడూరులో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు స్కూటీపై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో అప్పయ్యగేటు వంతెన వద్ద అదుపుతప్పి వంతెన గోడను ఢీకొట్టాడు. దీంతో స్కూటీ బోల్తా తల తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వంతెనపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వెంటనే హైవే మొబైల్ సిబ్బంది, ఏఎస్‌ఐ తిరుపాలు, పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పవన్‌సాయిరెడ్డి బంధువులు ప్రమాదస్థలికి చేరుకుని బోరున విలపించారు. శవపరీక్షల నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	186
స్కిన్‌లెస్	210
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7388
వెండి కిలో ధర	రూ. 92,800
వెండి ఒక గ్రాము	రూ.95.80

రేషన్ బియ్యం మళ్లింపు
500 టన్నులు?

- కావలిలో ప్రతినెలా ఇదే తంతు
- తమకే అమ్మాలని కొందరి నేతల ఒత్తిళ్లు
- వైసీపీ రైస్ మిల్లర్లకు ఏజెంట్లుగా టీడీపీ నేతలు
- ప్రభుత్వాలు మారినా ఆగని రేషన్ మాఫియా



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బియ్యం రవాణా చేస్తూ పట్టుబడిన లారీలు

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం కేంద్రంగా రేషన్ మాఫియా చెలరేగుతోంది. చెన్నైతో పాటు ఇతర ప్రాంతాలకు రేషన్ యథేచ్ఛగా అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. ప్రతినెలా సుమారు 500 టన్నుల వరకు బియ్యం దారిమళ్లుతోందనే ఆరోపణలు ఉన్నాయి. రైస్‌మిల్లర్లకు ఆదాయం చూసుకుని అమ్ముకుంటూ దీన్ని ఒక వ్యాపారంగా కొనసాగిస్తున్నారు. కాగా, కావలి కేంద్రంగా స్థానికంగా గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని మిల్లర్లకు చేరవేస్తున్నారు. మిల్లర్ల నుంచి అవి చెన్నైకు తరలిస్తున్నారు. ఇటీవల కావలి టోల్‌ప్లాజా వద్ద రెండు లారీలలో తరలిపోతున్న 55టన్నుల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేతల మధ్య పోటీ

ఇప్పటివరకు ముగ్గురు నలుగురు నేతలు స్థానికంగా రేషన్ బియ్యం కొనుగోళ్లకు పోటీ పడుతుండగా తాజాగా నెల్లూరుకు చెందిన అధికార పార్టీకి చెందిన ఓ నేత పేరు చెప్పి కొందరు దళారులు రేషన్ బియ్యం తమకే అమ్మాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నట్లు తెలుస్తోంది.

రవాణా ఇలా..

రేషన్ బియ్యం స్థానికంగా మూడు దశలలో చేతులు మారుతోంది. కార్డుదారుల నుంచి రేషన్ బియ్యంను వాహనదారులు కొనుగోలు చేస్తున్నారు. వాహనదారుల నుంచి మధ్యవర్తులు కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వాహనదారులు అధిక లాభం కోసం మధ్యవర్తులతో సంబంధం లేకుండా నేరుగా మిల్లర్లకు విక్రయిస్తున్నారు. మరి కొందరైతే ఎంఎల్‌ఎస్ స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిలతో మాట్లాడుకుని సర్దుబాటు చేసుకుంటూ స్టాక్ పాయింట్ నుంచే మిల్లర్లకు తరలిస్తున్నారు.

కిలో రూ.15లకు కొని

గతంలో రేషన్ కార్డుదారుల వద్ద కిలో రూ.10 నుంచి 12లకు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం కొనుగోళ్లు విచ్చలవిడి కావటంతో కార్డుదారుల వద్ద బియ్యం ఇచ్చే వాహనదారులే నేరుగా రూ.15 నుంచి 18లకు కొనుగోలు చేస్తున్నారు. వారు మిల్లర్లకు రూ.24లకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

యథేచ్ఛగా కొనుగోలు

కావలిలో రేషన్ బియ్యంను వైసీపీకి చెందిన నాలుగు రైస్ మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. అయితే వారికి రేషన్ బియ్యం చేరవేసేందుకు టీడీపీ చోటా నేతలే ఏజంట్లుగా ఉంటూ వారి కమిషన్ వారు తీసుకుని మిల్లులకు అప్పగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ బియ్యం అత్యధికంగా కొనుగోలు చేసే ఒక మిల్లరు కూటమి ప్రభుత్వం రాగానే ఆ వ్యాపారానికి స్వస్తి పలికారు. అయితే వైసీపీకి చెందిన మిగిలిన మిల్లర్లు కూటమి నేతల సహకారంతో రేషన్ బియ్యం వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. కావలి పట్టణ పాతూరుకు చెందిన ఒక రైస్‌మిల్లు నిత్యం రేషన్ బియ్యం వ్యాపారం చేస్తున్న విషయం అధికారులకు తెలిసినా దానిని ఎవరూ కట్టడి చేయలేక పోతున్నారు. గతంలో అనేక పర్యాయాలు విజిలెన్స్ దాడులు చేసినా వ్యాపారం ఆపడం లేదు. కూటమి ప్రభుత్వం రాగానే ఆయన తొలుత భయపడి మిల్లును ఎవరికైనా లీజుకు ఇవ్వటానికి సిద్ధపడ్డారు. తొలుత ఒక నెల ప్రయోగం చేసి ఇబ్బం దులు వస్తే వదిలేయాలను కున్నారు. అయితే ఆయన వ్యాపారానికి ఎలాంటి ఇబ్బందులు లేకపోవటంతో ఈ వ్యాపారం కొనసాగిస్తున్నారు. అలాగే వైసీపీ పార్టీకి చెందిన మద్దూరుపాడులో రెండు రైస్‌మిల్లులు, జలదంకి మండలం జమ్మలపాలెం-జలదంకి మధ్యలో ఉన్న ఓ రైస్‌మిల్లులలో ఈ వ్యాపారం జోరుగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లమో కోర్సులు

నెల్లూరు (వైద్యం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో తొలిసారిగా డిప్లమో కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజమన్నార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన ఇంటర్మీడియట్ విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్, అనస్థీషియా టెక్నీషియన్, అప్తాల్మిక్ టెక్నీషియన్, ఆప్టోమెట్రీ టెక్నీషియన్, మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ తదితర 95 సీట్లకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. బైపీసీ విద్యార్థు లకు తొలి ప్రాధాన్యమని తరువాత ఎంపీసీ విద్యార్థులకు మిగిలిన సీట్లను ఇతర గ్రూపుల వారికి ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు డిసెంబరు 2లోపు కళాశాల పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్ర 5 గంటలలోపు దర కాస్తులు అందచేయాలని కోరారు. దరఖాస్తు రుసుముగా రూ.100 చెల్లించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను నేరుగా వైద్య కళాశాలలోగానీ రిజిస్టర్ పోస్టు ద్వారాగానీ పంపాలని సూచించారు. పూర్తి వివరాలకు apsrnellore.ap.gov.in/notice/recruitment వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

మద్యం షాపు వద్ద ఉద్రిక్తత


- స్థానికుల మైక్ లాక్కునేందుకు యత్నించిన పోలీసులు
- ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం

నెల్లూరు(క్రైం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వాకర్స్ రోడ్డులో మద్యం దుకాణాన్ని తొలగించాలంటూ చేపట్టిన ఆందోళన ఉద్రిక్తం గా మారింది. స్థానికులు మైక్‌లో నినాదాలు చేస్తుండగా పోలీసులు లాగేసు కునేందుకు యత్నించారు. దీంతో పోలీసుల తీరుపై వారు అసహనం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్లితే... వాకర్స్ రోడ్డులో జనావాసాల నడుమ ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానికులు సుమారు 15 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం వారు ఆందోళనను తీవ్రతరం చేశారు. మద్యం దుకాణం వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని స్థానిక మహిళలు మైకులో మాట్లాడుతుండగా చిన్నబజారు పోలీసులు మైక్ లాక్కునేందుకు యత్నించారు. దీంతో పోలీసులు, స్థానికుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసుల తీరును వారు నిరసిస్తూ నినాదాలు చేశారు. వైన్ షాపును తొలగించేంత వరకు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పారు. పోలీసులను వివరణ కోరగా, మైక్‌కు పర్మిషన్ లేదని, మైక్ పర్మిషన్ లేకుండా వినియోగించడం తగదని సూచించామని చెప్పారు.

బెల్టు షాపులపై దాడులు

నెల్లూరులోని సంతపేట ప్రాంతం వైఎస్‌ఆర్ మార్కెట్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మద్యం అమ్ముతున్న షేక్ నజీర్ బాషాను అరెస్టు చేసి అతని వద్ద నుంచి పది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్‌ఐ జేకేవీఎస్ మురళీకృష్ణ మాట్లాడుతూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షేక్ నజీర్ బాషాపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఫిరోజ్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్‌యూలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో గురువారం మెరైన్ బయాలజీ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. వీసీ సారంగం విజయభాస్కర్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సముద్రజీవ వ్యవస్థల పరిరక్షణ, శాశ్వత మత్స్య ఆకర్షణ, ప్రాథమిక అవసరాలపై అవగాహన కల్పించడం ద్వారా సమాజాభివృద్ధి సాధ్యమవుతందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కే. సునీత, మత్స్యకార శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. విజయ, విభాగాధిపతి డాక్టర్ హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బంగారంతో ఉడాయించిన వర్కర్లు

నెల్లూరు(క్రైం),నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాల తయారీకి ఇచ్చిన ముడి బంగారంతో ఐదుగురు వర్కర్లు ఉడాయించారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని ఖుద్దూస్ నగర్‌కు చెందిన ఖలీల్ అహ్మద్ గిడ్డంగివీధిలో బంగారు ఆభరణాల తయారీ దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారుల నుంచి ఆర్డర్లు తీసుకుని కమిషన్ పద్ధతిపై ఆభరణాలను తయారు చేసి ఇచ్చేవాడు. అతని దుకాణంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన షేక్ నిమాజ్ రెండేళ్లుగా మేనేజర్‌గా పని చేస్తున్నాడు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సహరన్, మొనిరుల్, ఇదరేష్, సఫీక్, బిశ్వనాథ్ డాకేలు ఈ ఏడాది ఆగస్టులో ఖలీల్ వద్ద పనిలో చేరి నమ్మకంగా ఉండసాగారు. సెప్టెంబరు 4వ తేదీ ఖలీల్ అహ్మద్ బంగారు ఆభరణాల తయారీ నిమిత్తం సహరన్, మొనిరుల్, ఇదరేష్‌కు 40 గ్రాములు, సఫీక్‌కు 137 గ్రాములు ముడి బంగారాన్ని ఇచ్చాడు. మేనేజర్ ద్వారా కొంత బంగారాన్ని బిశ్వనాథ్ ఢాకేకు ఇచ్చారు. వర్కర్లందరూ కలిసి బంగారు ఆభరణాలు తయారు చేయకుండా అదే నెల 19వతేదీ బంగారంతో ఉడాయించారు. బాధితుడు వారి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. ఫోన్లు స్విచ్ ఆఫ్ ఉన్నాయి. ఈ మేరకు బాధిత యజమాని గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఆపార్' నమోదును
వేగవంతం చేయండి

- ఆర్‌ఐవో శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐవో

నెల్లూరు(విద్య), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య కలిగిన ఆటోమేటిడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(ఆపార్) కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఇంటర్‌బోర్డు ఆర్‌ఐవో డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు ఆదేశించారు. నగరంలోని ఆర్‌ఐవో కార్యాలయంలో గురువారం జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా కళాశాలల్లో నమోదు ప్రక్రియ సంతృప్తికరంగా లేదని, కారణాలను విశ్లేషించుకుని తగినంత పురోగతి సాధించాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో మురళీధర్, సీఆర్‌పీలు విష్ణువర్ధన్‌రావు, సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ ఇవ్వాలి

- మత్స్యకార సంఘాల నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): జోన్లతో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికీ విద్యుత్ రాయితీ అందించాలని పలువురు మత్స్యకార సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరులోని మత్స్యశాఖ కార్యాలయంలో గురు వారం ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని జేడీ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకార సంఘాల నాయకులు మాట్లాడుతూ తమిళనాడు బోట్ల సమస్య, ఆయిల్ సబ్సిడీ, మత్స్యకార భరోసా పథకం అందరికి వర్తింపచేయాలని కోరారు. అదేవిధంగా నాణ్యమైన రొయ్య విత్తనం అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. డీప్ సీ బోట్లకు 60శాతం నుంచి 75శాతం వరకుకు సబ్సిడీ పెంచాలన్నారు. కాగా, సముద్ర, దేశీయ జలాశయాల్లో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని ఈసందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. ఈకార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ వీవీఆర్ బాబు, నెల్లూరు పార్లమెంటు మత్స్యకార విభాగం అధ్యక్షుడు పామంజి శేషయ్య, తిరుపతి అధ్యక్షుడు ఆవుల మణిరత్నం, పలువురు నాయకులు, అధికారులు, సాగరమిత్రలు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఎన్‌సీసీ అధికారిగా నరేంద్రబాబు



నరేంద్రబాబు

నెల్లూరు(విద్య), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎన్‌సీసీ అధికారి గుండాల నరేంద్ర బాబును రాష్ట్ర ఎన్‌సీసీ యూనిట్ నుంచి ఉత్తమ ఎన్‌సీసీ అధికారిగా ఎంపిక చేసినట్లు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ఎన్‌సీసీ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీ మధు సూ దన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు బీవీనగర్‌లోని కేఎన్ ఆర్ నగరపాలక ఉన్నత పాఠశా లలో 10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్‌గా నరేంద్రబాబు 12 ఏళ్లుగా సేవలంది స్తున్నారు. గతేడాది కూడా ఉత్తమ అధికారిగా ఎంపికై గణతంత్ర దినోత్సవాన కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈ ఏడాది కూడా ఉత్తమ అధికారిగా ఎంపికవడం ఆనందంగా ఉందని, మున్ముందు మరిన్ని సేవలందిస్తానని నరేంద్రబాబు తెలిపారు. ఆయనను నెల్లూరు విభాగం కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదంగవే, పాఠశాల హెచ్‌ఎం విజయ్ ప్రకాష్‌రావు అభినందించారు.

వెంటాడుతున్న వర్షాభావం

- ఐదేళ్లుగా చెరువుల కింద సాగుకు నోచుకోని వరిపైరు
- నీరు లేక అడవిని తలపిస్తున్న చెరువులు
- ఈ ఏడాది కూడా పంటల సాగులేనట్లే..!

లింగసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని ఐదేళ్ల నుంచి తీవ్ర వర్షాభావం వెంటాడుతుండటంతో సాగునీటి చెరువుల్లో నీరులేక ఆయకట్టు భూములు సాగుకు నోచుకోవడం లేదు. ఒక్క చినపవని చెరువు కింద మాత్రమే 750ఎకరాల్లో మాత్రమే మూడేళ్ల నుంచి వరి సాగు చేస్తున్నారు. చిన పవని చెరువుకు అరకొరగా కురిసిన వర్షపు నీటితో పాటు, రాళ్లపాడు ప్రాజెక్టు నీరు కూడా చేరుతోంది. దీంతో ఈ చెరువు కింద వరి పైరును సాగు చేస్తారు. మిగిలిన లింగసముద్రం కొత్త, పాత చెరువులు, మొగిలిచెర్ల, విశ్వనాథపురం, మేదరమెట్లపాలెం, పెదపవని, వీఆర్ కోట, చెరువుల కింద ఈ పంట సాగు చేయడం లేదు.

● చిల్లచెట్లతో నిండిన చెరువులు

చెరువుల లోపల, కట్టలపైన, చిల్లచెట్లు విపరీతంగా పెరిగాయి. దీనికితోడు తూముల షట్టర్లు, రాడ్లు తుప్పుపట్టాయి. అసలు ఈ షట్టర్లు, రాడ్లు ఉన్నాయో లేవో అధికారులు తనిఖీలు చేయాల్సి ఉంది. అలాగే పంట కాలువలు కూడా పూడిపోయి, చిల్ల చెట్లు పెరిగి అధ్వానంగా మారాయి. ఈ చెట్లకు వేలం వేసి వీటిని తొలగించాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు. దీంతో చినపవని మినహా మిగిలిన సాగు నీటిచెరువుల ఆయకట్టు పరిధిలోని సుమారు 1700ఎకరాల్లో వరి సాగుకు నోచుకోలేదు. దీంతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పశువులు కూడా పశుగ్రాసానికి పాడిరైతులు ఇబ్బందులు పడుతున్నారు. లింగ సముద్రం పాతచెరువు కట్ట అప్పుడప్పుడు కురిసే వర్షాలకు కోతకు గురి అవుతుంది. కట్టపై రంధ్రం ఏర్పడి ప్రమాదకరంగా మారుతోందని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


చిల్లచెట్లతో నిండిపోయిన లింగసముద్రం పాత చెరువు

దూడలకు వ్యాధి నివారణ టీకాలు

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెయ్యదూడలకు వచ్చే బ్రూసెల్లా వ్యాధి నివారణకు ఈ నెల 20నుండి డిసెంబరు 20వరకు టీకాలు వేయనున్నట్లు కలిగిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు సురేష్ బాబు తెలిపారు. 4నుండి 8నెలల వయసున్న పెయ్యదూడలకు ఒక్కసారి ఈ టీకా వేస్తే జీవితకాలం ఈసుకు (అబార్షన్) పోవు లక్షణం నుంచి వాటిని కాపాడుకోవచ్చన్నారు. ప్రతిపాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్ బాక్స్

పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకటేశ్వర రావు

గుడ్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీలో పంచాయతీ పారిశుధ్య సిబ్బంది చేపట్టిన డ్రైనేజి పనులను గురువారం ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పరిశీలించారు. కాలనీలో మురుగునీరు నిల్వ ఉండటం, చెత్త పేరుకుపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని వీటి బారినపడి విషజ్వరాలు వస్తున్నట్లు స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు పనులు చేపట్టామన్నారు. ఆయన వెంట సర్పంచ్ పాలకీర్తి శంకర్, జనసేన నాయకులు అన్నంగి చలపతి పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ


మాట్లాడుతున్న ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మి

చేజర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వంద శాతం సబ్సిడీపై ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు అంద జేయనున్నట్లు ఉద్యానవన శాఖ అధికారి లక్ష్మీ తెలియజేశారు. గురువారం చేజర్లలోని రైతుసేవా కేంద్రంలో సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె సూక్ష్మ సేద్యం, ఉద్యానవన పథకాల గురించి వివరించారు. బిందు, తుంపర్ల సేద్యంపై "రైతులను ప్రోత్సహించి, వారి వివరాలను రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వి శశిధర్, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ పనుల ప్రారంభం


గాంధీజన సంఘంలో జరుగుతున్న సిమెంట్ రోడ్డు పనులు

సంగం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘంలో గురువారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. పల్లె పండుగలో భాగంగా ఇటీవల ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో మంజూరైన రూ. 5 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. స్థానిక టీడీపీ నాయకులు మానికల కృష్ణమూర్తి, మాజీ సర్పంచు సుజాత, క్లస్టర్ ఇన్‌చార్జి బాణా శ్రీనివాసులురెడ్డి, వార్డు సభ్యులు పాల్గొని భూమిపూజ చేసిన అనంతరం పనులు ప్రారంభించారు.

24న బ్రాహ్మణ వన సమారాధన

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : జిల్లా బ్రాహ్మణసేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఈనెల 24న నెల్లూరులోని కొండాయపాళెం గేట్ సుజాతమ్మ కాలనీ సమీపంలోని అష్టలక్ష్మి ఆలయం, శ్రీకృష్ణయోగ మందిరాల్లో కార్తీక దామోదర మహా రుద్రాభిషేకం, వన సమారాధన, సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఉదయాద్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎస్‌వీఎస్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు


మాట్లాడుతున్న రషీద్

ఉదయగిరి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ పేర్కొన్నారు. ఈనెల 11న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అఖిల్, హీనా, ప్రధానోపాధ్యాయుడు నాయబ్, ఎస్‌ఎంసీ చైర్మన్ కవిత, ఆవాజ్ కమిటీ నాయకులు షేక్ నాయబ్, ఎస్‌ఎం బాషా, రంతుల్లా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

అనంతసాగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరులో గురువారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బోయళ్ల జనార్దన్‌రెడ్డి మాలదారులకు అన్నప్రసాదంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల కుంభకోణంపై సీఐడీ విచారణ జరిపించాలి

● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జగనన్నకాలనీల పేరుతో కావలిలో సేకరించిన 192ఎకరాల భూ కుంభకోణంపై సీబీసీఐడీకి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే డి.క్రిష్ణారెడ్డి గురువారం అసెంబ్లీ సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీలు ఏర్పాటు చేయదలచుకున్న ప్రాంతంలో మాజీ ఎమ్మెల్యే ముందస్తుగా రైతులను బెదిరించి వారివద్ద నుంచి తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేశారన్నారు. ఎకరా రూ.13లక్షలకు తన డ్రైవర్లు, ఇంట్లో పని చేస్తున్న వారి పేర్ల మీద కొనుగోలు చేసి వారికి తమ కుటుంబసభ్యుల అకౌంట్‌ల నుంచి నగదు జమ చేయించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. దాన్ని ప్రభుత్వానికి రూ.50లక్షలకు విక్రయించి ఇన్‌సైడ్ ట్రేడింగ్ చేశారన్నారు. ఈ వ్యవహారాన్ని అప్పటి కలెక్టర్ అడ్డుకోవటంతో ఆయన్ను బదిలీ చేయించారన్నారు. 11అడుగుల ఎత్తున్న ప్రాంత గ్రావెల్‌ను అక్రమంగా అక్కడ నుంచి మరొక ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని చెప్పారు. మొత్తం 8,779ఇళ్లలో 1,560మాత్రమే నిర్మాణం పూర్తి చేశారని వాటిల్లో 15మంది మాత్రమే చేరినట్లు తెలిపారు.

సోమశిలకు 5,649 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 5,649 ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.837 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,050, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 3,000, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

భూముల ఆక్రమణలపై నివేదిక అందచేయాలి : ఆర్డీవో

మర్రిపాడు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 21: మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆత్మకూరు ఆర్డీవో పావని స్పందించారు. ఆమె గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సచివాలయ సర్వేయర్‌లతో సమావేశం ఏర్పాటుచేసి, ప్రతీ రెవెన్యూలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములకు సంబంధించి నివేదిక తయారుచేసి వారంరోజుల్లో తమకు అందజేయాలని ఆదేశించారు. ప్రధానంగా పొంగూరు, ఇర్లపాడు, అల్లంపాడు, చుంచులూరు, కదిరినేనిపల్లి, బ్రాహ్మణపల్లి రెవెన్యూల్లో అక్రమార్కులు ప్రభుత్వ భూములు ఆక్రమిస్తున్నారని ఫిర్యాదులు అందాయని తెలిపారు. అనంతరం పొంగూరు రెవెన్యూలో భూఆక్రమణ జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి పరిశీలించగా అక్కడ పట్టాదారుడు తమ భూమిని చదును చేసుకుంటుండడంతో తప్పుడు ఫిర్యాదుగా నిర్ధారించుకొని వెళ్లారు. ఆమె వెంట ఆర్ఐ సాయికిరణ్, వీఆర్వోలు ఉన్నారు.


పొంగూరు గ్రామంలో భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో పావని

అటవీ భూముల జామాయిల్ కర్ర అంచనాల్లో భారీ వ్యత్యాసం

- పారదర్శక అంచనాలతో తిరిగి టెండర్లు పిలవాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు

కందుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీభూముల్లో జామాయిల్ కర్ర విక్రయాల కోసం ఇటీవల పిలిచిన టెండర్లులో కర్ర అంచనాలో అధికారులు భారీవ్యత్యాసాలు చూపించారని ప్రత్యేకఅధికార బృందాలతో అంచనాలు వేయించి తిరిగి టెండర్లు పిలవాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు కోరారు. గురువారం మండలిలో మంత్రి పవన్‌కల్యాణ్ ఉన్న సమయంలో మాధవరావు అటవీ టెండర్ల గురించి మాట్లాడారు. జిల్లాలో 3,669 హెక్టార్లలో 1.2లక్షల మెట్రిక్ టన్నుల జామాయిల్ కర్ర ఉందని అంచనా వేసి టెండర్లు పిలిచారని, వాస్తవానికి అటవీభూముల్లో 3.56 లక్షల టన్నుల కర్ర ఉందన్నారు. టన్నుకు రూ.8,100 ధర వేయటం ఎంతో హేతుబద్ధంగా ఉందన్నారు. వాస్తవంగా ఉన్న కర్రలో మూడోవంతు మాత్రమే చూపించటంతో రూ.200కోట్ల దోపిడీకి రంగం సిద్ధం చేశారని ఆరోపించారు. 3,669 హెక్టార్లలో 560హెక్టార్లు అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచినవి కాగా మిగిలినవన్నీ వనసంరక్షణ సమితుల ద్వారా స్థానిక పేదరైతులు, గిరిజనులు పెంచుకున్నవని తెలిపారు. ఈ భూముల్లో వచ్చే కర్రలో సగం రైతులకు సగం అటవీశాఖకు చెందుతుందన్నారు. జామాయిల్ కర్ర అంచనాల్లో చేతివాటం చూపించడం వలన పెంచుకున్న రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సమగ్ర విచారణ జరిపి వాస్తవిక అంచనాలు వేసిన తర్వాత తిరిగి టెండర్లు పిలవాలని కోరారు. మంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకోవటం జరుగుతుందని సమాధానమిచ్చారని ఆయన తెలిపారు.

రోడ్డు మార్జిన్ స్థలం ఆక్రమణ

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

కందుకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్ చర్చి వద్ద ఉన్న రోడ్డుమార్జిన్‌ను ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. చర్చి నుంచి మార్కెట్ సెంటర్‌కు వెళ్లేమార్గంలో రోడ్డుమార్జిన్‌లో అక్రమంగా షాపులు నిర్మించేందుకు గురువారం ఆగమేఘాలమీద పనులు చేయిస్తున్నారు. మూడేళ్లక్రితం ఈ ప్రదేశంలో అక్రమ నిర్మాణం కోసం టౌన్‌చర్చి పెద్దలు ప్రయత్నాలు చేయగా ఆంధ్రజ్యోతి అక్రమ నిర్మాణాన్ని వెలుగులోకి తేవటంతో మున్సిపల్ అధికారులు పనులు నిలిపివేయించి అప్పటికే వేసిన పునాదులను తొలగింపజేశారు. అయితే ప్రస్తుతం మరోసారి చర్చి పెద్దలు ఆ ప్రయత్నాన్ని ప్రారంభించారు. అప్పట్లో రాత్రివేళ పునాది వేయగా ప్రస్తుతం పట్టపగలే నిర్మాణానికి తెగబడటం విశేషం. ఓవీ రోడ్డుకు చర్చి సెంటర్ నుంచి మార్కెట్‌కు వెళ్లే మార్గానికి కూడలిలో ఎంతో విలువైన రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తెగబడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గం అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ అంతరాయం కలిగితే ప్రత్యామ్నా య మార్గంగా నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటోంది. ఈ పరిస్థితిలో చర్చి సెంటర్ నుంచి మార్కెట్‌సెంటర్ వరకు ఆక్రమణల తొలగింపు చేయాలన్న డిమాండ్ బలంగా ఉంది. ఈ తరుణంలో కూడలిలోనే ఆక్రమణకు తెగబడటం, అదీ ఓ ప్రార్థనాలయం ముందు షాపుల నిర్మాణం చేస్తుండటం తెగింపుకు పరాకాష్టగా పట్టణవాసులు విమర్శలు వస్తున్నాయి. అక్రమ నిర్మాణం గురించి మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తక్షణం ఈ అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు


బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ, అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ నారాయణస్వామి, కిరణ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయం, డిగ్రీ కళాశాలలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు సునీల్ కుమార్, వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ ఏ నరసింహులు, విశ్రాంత గ్రంథాలయాధికారి ఫజులుల్లా, అధ్యాపకులు సోమశేఖర్, కేసీ విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వెంగమాంబ పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకీసేవ గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక చందన అలంకారం, కుంకుమార్చన నిర్వహించిన అనంతరం పల్లకీ సేవ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అందరి సహకారంతో విద్యాభివృద్ధికి కృషి

● వెంకట శివకుమార్, ఎంఈవో-2



లింగసముద్రం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషిచేస్తున్నట్లు ఎంఈఓ-2 వెంకట శివకుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే కొత్త విధానాలతో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

? నూరు శాతం ఉత్తీర్ణతకు ఏమి చర్యలు చేపట్టారు.

! ప్రతిరోజూ సాయంత్రం అదనంగా ఒక గంట క్లాసు తీసుకుంటున్నారు. అలాగే ప్రతిరోజూ ఉపాధ్యాయులు మోడల్ పేపరు పరీక్ష పెడుతున్నాం. జనవరి 20 నుంచి 100రోజుల కార్యక్రమంలో విజయదీపిక అనే మోడల్ పేపర్ల పుస్తకంతో పరీక్షలు పెడతాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం.

? విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గిందా.

! అన్ని పాఠశాలల్లో 4,426 మంది చదువుతున్నారు. డ్రా పౌట్స్ 410 మందిని గుర్తించాం. వారిని కొంతమందిని చేర్పిస్తాం

? ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.

! యూనిఫామ్స్, బూట్లు, పుస్తకాలు విద్యార్థులందరికీ అందుతున్నాయి. అందని వారిని గుర్తించి వారికి అందజేస్తున్నాం.

? ఉపాధ్యాయుల కొరత ఉందా?

! మండలంలోని హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. అయితే పని సర్దుబాటు ద్వారా ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

? మధ్యాహ్న భోజన పథకం ఎలా ఉంది?

! విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నాము. ప్రతిరోజూ సిబ్బంది, హెచ్ఎంలు తనిఖీలు పరిశీలిస్తున్నారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన


ఇళ్ల లబ్ధిదారులతో జనసైనికులు

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరుపాడులోని టిడ్కో ఇళ్లను గురువారం జనసేన జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జనసైనికులు పరిశీలించారు. ఈ సందర్భంగా టిడ్కో లబ్ధిదారులు వారి సమస్యలను తెలిపారు. ఉచితంగా ఇళ్లు అనుకుంటే బ్యాంకు అధికారులు నెలవారీగా డబ్బులు కట్టమని నోటీసులు పంపుతున్నారని వాపోయారు. ఇళ్లు మంజూరు చేసినా రిజిస్టర్ చేసి తమకు ఇవ్వలేదని మరికొందరు చెప్పారు. టిడ్కో గృహ సముదాయానికి ప్రహరీ లేనందున తూర్పున ఉన్న చెరువు నీరు వర్షాకాలంలో గ్రౌండ్‌ఫ్లోర్ వద్దకు వస్తుందని చెప్పారు. రాత్రిళ్లు విషపురుగుల బెడద ఎక్కువగా ఉందన్నారు. తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. సమస్యలను టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, కావలి ఎమ్మెల్యే వెంకట క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో జనసైనికులు తోకల వెంకటేశ్వర్లు, పాలడుగు వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, షేక్ షమీ, కల్యాణ్, బాస్కర్, వినోద్ పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

వింజమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి సూచించారు. మండలంలోని బుక్కాపురం, ఏకిస్త్రీపురం, చింతలపాలెం గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో గురువారం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే గ్రామాల్లో ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలని సూచించారు. సీసీ రోడ్లను, పశువుల షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రసూల్, ఉప సర్పంచ్ రమణారెడ్డి, ఎంపీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి

వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు


బహుమతి ఇస్తున్న ప్రిన్సిపాల్ హుసేన్ పీరా

ఏఎస్ పేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు సూచించారు. గురువారం ఆయన స్థానిక మోడల్ స్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసర చన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హుసేన్ పీరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఉదయగిరి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో 2, 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఇటీవల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యా లయం బాపట్లలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీన్‌తో పాటు అధ్యాపకులు గోపికృష్ణ, సునీత అభినందించారు.


విద్యార్థులతో అధ్యాపకులు


మాట్లాడుతున్న సీఐ గంగాధర్

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని సీఐ గంగాధర్ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరుపాళెం సెంటర్ నుంచి పట్టణంలోని ప్రధాన రహదారి వరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏర్పాటుచేసిన వాటిలో పనిచేయని సీసీ కెమెరాలను మరమ్మతులు చేయించడంతో పాటు నూతనంగా 30సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వారం రోజుల్లోపు పట్టణంలో సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానవీధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణ ఆర్యవైశ్య అసోసియేషన్ వారు రూ. 50 వేలు అందించారని తెలిపారు. అలాగే ఆత్మకూరు సర్కిల్ పరిధిలో బెల్టుషాపుల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ జిలాని, సీసీ కెమెరాల టెక్నీషియన్ మన్సూర్ పాల్గొన్నారు.

కుక్కల గుంపులపై ప్రజల ఆందోళన

కలిగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వందల సంఖ్యలో కుక్కలు మందలుగా తిరుగుతున్నా పంచాయతీ అధికారులు, పాలకులు పట్టించుకోక పోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక కొత్తూరు ప్రాంతం, సాయిబాబా మందిరం, బస్‌స్టేషన్, హెచ్‌పీ పెట్రోల్ ప్రాంతాల వద్ద కుక్కలు గుంపులుగా తిరుగాడుతూ మనుషులపై దాడికి యత్నిస్తున్నాయని, ఐదేళ్లుగా కుక్కల నిర్మూలన చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు. వారంరోజుల కిందట చిన్నారులను పాఠశాలలో వదిలిరావడానికి వెళ్లిన మహిళపై 10కిపైగా కుక్కలగుంపు వచ్చేసరికి ఆమె పిల్లలతో ఆలయంలోకి పరుగులు తీసింది. బుధవారం ఓ చిన్నారి బాలుడు హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద స్కూల్ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా కుక్కల మంద దాడికి ప్రయత్నించగా స్థానికులు స్పందించడంతో ప్రమాదం తప్పింది. రాత్రి అయితే కాలనీల్లో తిరగలేక పోతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి కుక్కలనిర్మూలనకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.


సాయిబాబా మందిరం వద్ద సంచరిస్తున్న కుక్కలగుంపు

నివాసమున్న చోటే ఓటుహక్కు ఉండాలి

● మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్


మాట్లాడుతున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

కావలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణవాసులు నివాసమున్న వార్డుల్లోని పోలింగ్ కేంద్రంలోనే ఓటుహక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో బీఎల్వోలు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల, సవరణల కోసం ఇంటింటికి తిరుగుతున్నారని చెప్పారు. త్వరలో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓట్లు లేని వారు కొత్త ఓటు నమోదుకు ఫారం-6 ద్వారా, ఓటు షిఫ్టింగ్ చేసుకునే వారు ఫారం-8 ద్వారా చేసుకోవచ్చన్నారు. మీ ఇళ్లకు వచ్చే బీఎల్వోల సహకరించి మీరు నివాసం ఉన్న ఇంటిలో ఓటు ఉండేలా చేసుకోవాలన్నారు. ఈ నెల 27వ తేదీలోపు మాత్రమే అవకాశం ఉందన్నారు. జియో ట్యాగింగ్, బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ చేసేందుకు సచివాలయ సిబ్బంది మీ ఇళ్లకు వస్తున్నారని వారికి సహకరిం చాలన్నారు. మీరున్న చోటనే ఓటు ఉండటమే కాక బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, జియో టాగింగ్‌లు ఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు అందుతాయన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ వాటిక'

నెల్లూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటిక పథకం ద్వారా మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టినట్లు నెల్లూరు ప్రాజెక్టు సీడీపీవో లక్ష్మీదేవి తెలిపారు. నెల్లూరు రూరల్లోని అక్క చెరువుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ తమ ప్రాజెక్టు కింద 7 కేంద్రాలు ఈ పథకానికి ఎంపికయ్యాయని చెప్పారు. మొక్కలు పెంచి పోషించడానికి ప్రభుత్వం రూ.10 వేలు సాయం అందిస్తోందని తెలిపారు. ఈ మొక్కల ద్వారా వచ్చే దిగుబడిని కేంద్రాల్లోని చిన్నారులకు ఆహారంగా వండి పెడ తారన్నారు. మునగ, ఉసిరి, బొప్పాయి మొక్కలను ప్రభుత్వమే అందిస్తుందని, ఆకుకూరల మొక్కలు, మట్టి, టబ్బుల కొనుగోలు చేసి వాటిలో మొక్కలు పెంచడం అంగన్‌వాడీల బాధ్యతన్నారు. పంట ఎక్కువగా పండితే స్థానికంగా విక్రయించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ స్వరూప, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.







స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు

నెల్లూరు (వైద్యం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను గురువారం వైద్యాధికారులు తనిఖీ చేశారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా మాస్‌మీడియా అధికారి కనకరత్నం, జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్, జిల్లా సర్వైలెన్స్ అధికారి డాక్టర్ భాస్కర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. అయా కేంద్రాల రికార్డులను పరిశీలించారు. ఫాం-ఎఫ్‌ను పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయరా దని, అలాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్కానింగ్ కేంద్రాల వద్ద ధరల పట్టికను ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు.



స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ట్రై సైకిళ్ల పంపిణీ

ముత్తుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మల్లూరులోని వృద్ధులు, దివ్యాంగులకు గురువారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లికార్జునయాదవ్ ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. వారి సమస్యలను ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగానే తక్షణం స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, టీడీపీ నాయకులు నీళ్ల రాంబాబు, సాగిరాజు శంకర్, అక్కయ్యగారి ఏడుకొండలు, గుంజి శ్రీను, నీళ్ల చలపతి, నీళ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మత్స్యకార సంఘ నాయకులు

ముత్తుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న మత్స్యకారుల సమస్యలు వి నేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అవకా శం ఇవ్వాలని ఏపీ సముద్ర తీర ప్రాంత మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసుంగారి గోవింద్ కోరారు. ముత్తుకూరు మధురానగర్‌లో గురువారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అనంతరం గోవింద్ మాట్లాడుతూ స్వా తంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటికి మత్స్యకా రులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సముద్ర తీర ప్రాంతంలో వేట మీద ఆధారపడి జీవించే మత్స్యకారులను బీసీ కేటగిరిలో కలిపి గత వైసీపీ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తమకు సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జానకిరామయ్య, పెద్దకాపు ఈశ్వరయ్య, నడిపికాపు శివ, చిన్నకాపు దొరబాబు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

పొదలకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం పెర్సిస్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వ హించి, గురువారం బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్ర మంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ ఎన్.దా మోదర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మధ్య ప్రశాంతిరెడ్డి పుట్టినరోజు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 21(ఆం ధ్రజ్యోతి) : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ముందస్తు పుట్టినరోజు వేడుకలను నగరంలోని ఆమె నివాసంలో గురువారం గిరిజన వి ద్యార్థుల మధ్య జరుపుకున్నారు. ఆమె కేట్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. గిరిజన సమస్యల ను ఇటీవల శాసనసభలో ప్రస్తావించిన ప్రశాం తిరెడ్డి, స్పెషల్ డ్రైవ్ ద్వారా 511 మంది గిరిజన బాలలకు ఆధార్ కార్డులో సవరణలు, జనన ధ్రు వీకరణ పత్రాలు వచ్చేలా చేశారు. ఆ సర్టిఫికె ట్లను తన పుట్టిన రోజు సందర్భంగా అంద చేశా రు. గిరిజన బాలలకు బర్త్ సర్టిఫికెట్లు లేనందున పాఠశాల అడ్మిషన్లలో ఆటంకం కలిగిందన్నారు. ఒక్క ఇందుకూరుపేట మండలంలోనే 600 మం ది గిరిజన విద్యార్థులను గుర్తించి వారికి సర్టిఫికె ట్లు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోడూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు క ల్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెంచుకిషోర్ యాదవ్, గుడి హరికుమార్‌రెడ్డి, ఇందుకూరుపేట ఎంపీడీవో నాగేంద్ర పాల్గొన్నారు.



గిరిజన విద్యార్థులతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బడి పనివేళల మార్పును ఉపసంహరించుకోవాలి

నెల్లూరు(విద్య), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో పనివేళల మార్పుతో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటారని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. పాఠశాలల పనివేళలను మార్చాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని శాసనమండలిలో గురువారం ఆయన ప్రభుత్వానికి విన్నవించారు. పనివేళలు పెంచడం వల్ల సాయంత్రం 5 గంటలపైన సరైన రవాణా సౌకర్యం లేనివారు ఇబ్బందులు పడతారన్నారు. బాలికలకు భద్రతా సమస్యలు తలెత్తే అవకాశమూ ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

తాటిముట్టి గుజ్జుకు భలే గిరాకీ



తాటిముట్టెల్లో ఉండే బుర్ర గుజ్జు (గుంజు)కు పట్టణాల్లో భలే గిరాకీ ఉంది. నాలుగు బుర్ర గుజ్జుల ముక్క ల్ని ఓ తాటి ముంగాంలో ఉంచి యువకులు విక్రయిస్తున్నారు. తోటప ల్లిగూడూరు మండలం ఈదూరుకి చెందిన యువకుడు శ్రీనివాసులు, కోవూరులో బుర్ర గుజ్జు అమ్ముతూ కనిపించాడు. పనులు లేని సీజన్‌లో జీవనోపాధి కోసం ఊరూరా తిరిగి బుర్ర గుజ్జు అమ్ముతున్నానని ఆ యువకుడు చెప్పారు. ఓ ముంగాం ధర రూ. 20 అని, రోజుకు 200 ముంగాలు అమ్ముతానని శ్రీనివాసులు తెలిపారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)

నేడు సాహిత్య సభ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు వర్ధమాన సమాజంలో సాహిత్య సభ జరుగుతుందని నిర్వాహకు లు తెలిపారు. ఈ సభలో గుంటూరు హిందూ కళాశాల ఆంగ్ల ఉపాధ్యాయు లు డాక్టర్ నందనవనం శ్రీనివాసరావు చాటు పద్యం, హాస్యం అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

'ఈబస్' ద్వారా విజయవంతంగా చికిత్సలు

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : మెడికవర్ ఆసుపత్రిలో ఎండోబ్రోన్సియల్ అల్ట్రాసౌండ్(ఈబస్) ద్వారా క్లిష్టమైన 50 వైద్య చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ కాంటరెడ్డి కౌశిక్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆసుపత్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈబస్ వైద్య పరికరం కేన్సర్, క్షయతోపాటు ఊపిరితిత్తుల క్లిష్టమైన వ్యాధులను నిర్ధారిస్తుందని చెప్పారు. తద్వారా చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

'సురేష్‌రెడ్డికి సహకరిస్తాం'

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జోనల్ ఛైర్మన్‌గా సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని, ఆయనకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ పేర్కొన్నారు. ఆ సంఘం నాయకులు గురువారం సురేష్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నందం అశ్వత్థామ, రామనాథ రాజశేఖర్, సోమా గోపాల్, కాసా శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దినేష్‌రెడ్డికి అభినందన

ఇందుకూరుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌రాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పోలంరెడ్డి దినేష్ రెడ్డిని గురువారం విజయవాడలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మునగాల రంగరావు ఆధ్వర్యంలో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్ర మంలో పేడూరు రామచంద్రయ్య, ఎర్రపరెడ్డి, సురేష్, లేబూరు వెంకటరమణయ్య, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.



దినేష్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

కృష్ణపట్నం కాలువపై సమీక్ష

నెల్లూరు(సిటీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కృష్ణపట్నం కాలువ ఆక్రమణలపై కార్పొరేషన్‌లోని కమిషనర్ చాంబరులో గురువారం సమీక్ష నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, ఆర్ శ్రీనివాసులు, నాగేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. నెల్లూరు అభివృద్ధిలో భాగంగా డివైడర్లు, కూడళ్లలోని ఫౌంటెన్లు, కాలువ గట్ల సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అటు సర్వేపల్లి, ఇటు కృష్ణపట్నం కాలువల గట్ల మీద దుకాణాలను తొలగించాల్సి రావడంతో తీసుకోవాల్సిన చర్యలు, బాధితులకు ఇవ్వాల్సిన భరోసా వంటి అంశాల పై లోతైన సమీక్ష నిర్వహించారు.

రేపు కార్తీక మహారుద్రాభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింహపురి ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఉచ్చి భువనేశ్వరీప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమ బ్రోచర్లను గురువారం బాలాజీనగర్ త్యాగరాజ స్వామి కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తాత్కాలిక శివలింగానికి ఉదయం 8 నుంచి 12గంటల వరకు భక్తులు స్వహస్తాలతో అభిషేకం చేసుకునే ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 11 రకాల ద్రవ్యాలతో మహాభిషేకం, పుష్పాభిషేకం జరుగుతాయని తెలిపారు. పుట్ట మట్టితో చేసిన 365 శివలింగాలకు అర్చన జరుగుతుందన్నారు. భక్తులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ చంద్రశేఖర్, పసుపులేటి మల్లికార్జున, సుభాన్‌బాషా, టీవీ శేషయ్య నాయుడు, వేమిరెడ్డి శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భువనేశ్వరీప్రసాద్ తదితరులు

గోమతినగర్‌లో భవనానికి తాళం

● అనుమతుల ఉల్లంఘనపై కమిషనర్ చర్య



భవన తనిఖీలో కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణంలో కార్పొరేషన్ అనుమతుల ఉల్లంఘనపై నగర కమిషనర్ సూర్యతేజ ప్రత్యక్ష చర్యలకు పూనుకున్నారు. ఇందులో భాగంగా గురువారం నగరంలోని 19వ డివిజన్ గోమతి నగర్‌లో నాలుగు అంతస్తుల భవనాన్ని ఆయన సిటీప్లానింగ్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పొందిన అనుమతుల కన్నా అదనంగా నిర్మాణాలు చేపట్టినట్లు గుర్తించిన కమిషనర్ మార్టిగేజ్ అంతస్తుకు తాళం వేయించారు. ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడితే ప్రత్యక్ష చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనుమతులకు మించి కట్టడాలు జరుగుతుంటే సిటీప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇదిలా ఉండగా గోమతినగర్‌లో కమర్షియల్ భవనాల నిర్మాణాల్లోనూ భారీగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన కమిషనర్ వాటన్నిటిపై చర్యలు తీసుకోవాలని సిటీప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ నందన్, డీసీపీ పద్మజ, ఆర్వో సమ్మద్ పాల్గొన్నారు.

అనుకూలంగా పాఠశాల వేళలు

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు21:(ఆంధ్రజ్యోతి): పాఠశాల వేళలు అందరికీ అనుకూలంగా ఉండేలా కృషి చేస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు ప్రకటించారని ఎస్‌ఎస్‌యూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మన్నం శ్రీనివాస్, శ్రీరామిశెట్టి వెంకటేశ్వర్లు తనకు ఈ విషయం తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 30 తరువాత యథావిధిగా ఉదయం 9నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల వేళలు ఉంటాయని పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

అవకతవకలకు పాల్పడితే చర్యలు : ఏపీవో

తోటపల్లిగూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్(ఏపీవో) అచ్చయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పని సమయంలో కావాల్సిన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రమాద బీమా అమలు చేస్తున్నామన్నారు. ఇసుకపాలెం, కోవెరపాలెం, వెంకన్నపాలెం, పొట్లపూడి, చిన్న చెరుకూరు గ్రామాల్లో ప్రస్తుతం పనులు లేవన్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఎక్కువ మంది కూలీలకు బిల్లులు పెట్టినట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కొన్ని పంచాయతీల్లో ఎక్కువమందికి మస్టార్‌లో హాజరు కనపరుస్తున్నారని, పనుల్లో అవకతవకలు జరిగితే చర్యలు తప్పవన్నారు.

24న కార్తీక వన భోజనం

పొదలకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న నరసింహకొండలో కార్తీక వనభోజనం నిర్వహిస్తున్నామని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పముజుల శంకరయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని దేవాంగులకు ఆయన కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా దేవాంగ మహిళలు, పిల్లలకు ఆటలు, పాటల పోటీలు, అంతాక్షరి, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు ముగ్గురి గైర్హాజర్

వెంకటాచలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో గురువారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 111 మందికిగానూ 108 మంది హాజరయ్యారు.

ఇళ్లు లేనివారి వివరాలు సేకరించాలి

బుచ్చిరెడ్డిపాళెం,నవంబరు21:(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో సొంతిళ్లు లేని వారి వివరాలు యాప్ ద్వారా సేకరించాలని ఎంపీడీవో శ్రీహరి ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ ఏఈ చిన్న పెంచలయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సర్వే గురించి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఇళ్లులేనివారు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులతో సచివాలయంలో సంప్రదించి, పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపీడీవో కోరారు.

జాతీయ హాకీ పోటీలకు 'భాస్విక'



నెల్లూరు(విద్య), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హర్యానాలో డిసెంబరులో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్-19 జాతీయ హాకీ పోటీలకు నెల్లూరుకు చెందిన మల్లెం భాస్విక ఎంపికైంది. నగరంలోని ప్రగతి మహావిద్యాలయంలో 9వతరగతి చదువుతున్న భాస్విక జిల్లాస్థాయిలో ఉత్తమంగా రాణించి రాష్ట్ర పోటీల కు ఎంపికైంది. కాకినాడలో ఈనెల 17, 18 తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండ ర్-19 రాష్ట్ర హాకీ పోటీల్లో ప్రతిభ చాటడంతో జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. ఆ బాలిక జాతీయ పోటీల్లోనూ రాణించాలని పాఠశాల నిర్వాహకులు అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి మాట్లాడుతూ పాఠశాల పీఈటీ రూన్సీ ప్రోత్సాహం, కోచ్ చందు శిక్షణలో ఉత్తమంగా రాణిస్తానని తెలిపారు.

24న బ్రాహ్మణ కార్తీక వన భోజనాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల తరఫున ఈనెల 24న బ్రాహ్మణ కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు గుడ్లదొన వాసుదేవరావు తెలిపారు. గురువారం జర్నలిస్టు భవనంలో కార్యవర్గ సభ్యులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయం ప్రాంగణంలో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మహారుద్రాభిషేకం, 516 మంది బ్రాహ్మణ దంపతులతో సత్యనారాయణ స్వామి వ్రతం జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, నాగలక్ష్మి, సురభి ఉమాదేవి, కేవీఎల్ నారాయణ, దుద్దుకూరు రమేష్, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

'అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోండి'

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట తడికల బజారు సెంటర్ చుందూరు అమ్మణ్ణమ్మ సత్రం స్థలంలో చేపట్టిన భవన నిర్మాణం అక్రమమని ఆ ప్రాంతానికి చెందిన వాయుగుండ్ల కార్తీక్ ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 2022లో ఆ భవన నిర్మాణ సమయంలోనే తాను నగర పాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. భవనం నిర్మిస్తున్న భూమి అధిక అంతస్తుల నిర్మాణానికి యోగ్యంకాదన్నారు. ఇంతవరకు ఆ భవనానికి బిల్డింగ్ ప్లాను ఆమోదం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణం జరిగిందన్నారు. కమిషనర్ విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.



6వ పేజీలో

మద్యం వల్ల కుటుంబాలు కూలిపోతాయి. మద్యం మీద ప్రభుత్వాలు నడుస్తాయి. రాజకీయ మాయాజూదంలో మద్యం ఒక పావు. 'అధికారంలోకి రాగానే సంపూర్ణంగా మద్యం లేకుండా చేసేస్తా..' అని చెప్పిన జగన్ ఐదేళ్లూ ఏకంగా ప్రభుత్వ దుకాణాలే తెరిచి విచ్చలవిడిగా మద్యం అమ్మించాడు. 'నియంత్రిస్తా.. ఎమ్మార్పీకే అమ్మిస్తా.. మాట వినకపోతే బెల్టు తీస్తా!' అని చెప్పిన చంద్రబాబూ చేతులెత్తేస్తున్నాడు. దుకాణాల వేలం పాటలైతే జిల్లాలో పారదర్శకమేగానీ, నిర్వహణ మాత్రం అధికారం చేతుల్లోనే కొనసాగుతోంది. నాయకుల కనుసన్నల్లోనే షాపులు నడుస్తున్నాయి. రాజీబేరాలూ, దబాయింపులూ దారికి తెచ్చేశాయి. వైసీపీ అనుభజ్ఞులతో కలిసిపోయి మరీ కొత్త కూటములు ఏర్పడ్డాయి. దుకాణాలు బార్లుగా మారిపోయాయి. ఊరూరా బెల్టుషాపులు వర్ధిల్లుతున్నాయి. ప్రభుత్వానికి తలవంపులు తెచ్చే విధంగా జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది.

ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెల్లడైన నిజాలు

తెగ తాగేస్తున్నారు!

● అసెంబ్లీలో మన వాయిస్

తుమ్మలగుంట చెరువును క్లోజ్ చేసేశారు



'తిరుపతిరూరల్ మండలం లోని దళవాయిపరిధిలోని చెరువు నిండాక పేరూరుకు.. అక్కడ్నుంచి తుమ్మలగుంట చెరువుకు.. అనంతరం అవిలాల, తిరుచానూరు చెరువులకు నీరు వెళ్తుంది. అటువంటి తుమ్మలగుంట చెరువును సుందరీకరణ పేరుతో గత చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సుమారు రూ.60కోట్ల తుడా నిధులు మళ్లించి ఖర్చు పెట్టారు. అభివృద్ధికి మేము అడ్డురాము. కానీ, తుమ్మలగుంట చెరువును క్లోజ్ చేయడంతో తాగునీరు సమస్య ఉంది. చెరువు పరిధిలో భవనాలు ఎక్కువ. ఈ చెరువు ఆయకట్టు సుమారు 118 ఎకరాల్లో ఉండగా.. చెరువు(ట్యాంక్) 143 ఎకరాలు. చెరువును క్లోజ్ చేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్‌జీటీ రూల్స్ సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఎక్కడగానీ చెరువును మూయకూడదు. కానీ, తుమ్మలగుంట చెరువుకు నీళ్ల వచ్చే కాలువలను కాంక్రీట్ వేసి క్లోజ్ చేశారు. ఇప్పుడు మనిషిని పంపినా కూడా చూడొచ్చు. దానివల్ల వరదలు వచ్చినప్పుడు తిరుపతి పరిసరాలు మునిగిపోతున్నాయి' అంటూ చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అసెంబ్లీలో పేర్కొన్నారు. దీనిపై మంత్రి నారాయణ స్పందిస్తూ.. 'చెరువు ఆయకట్టు 88.8 ఎకరాలు. ఇందులో 45ఎకరాల్లో గ్రావెల్‌తో లెవల్ చేసిన మాట వాస్తవమే. దాంట్లో పార్కులు, ప్లేగ్రౌండ్స్ ఉన్నాయి. ఇక్కడ వాటర్ కంట్రోల్ చేసే గేటు కానీ, మిగులు నీళ్లు కిందకి పోయే నిర్మాణాన్ని, లోపల నీళ్లుండే ఏరియాని డిస్టర్బ్ చేయలేదు' అని పేర్కొన్నారు. దీనిపై నాని స్పందిస్తూ.. తుమ్మలగుంట చెరువుకు నీళ్ల వచ్చే కాలువలను కాంక్రీట్ వేసి క్లోజ్ చేశారని స్పష్టంచేశారు. ఇప్పుడైనా దానిని చూడొచ్చన్నారు. దీంతో వరదలు వచ్చినప్పుడు తిరుపతి పరిసరాలు మునిగిపోతున్నాయని గుర్తుచేశారు. 'సుప్రీంకోర్టు, ఎన్జీటీ ఆర్డర్ ప్రకారం కొన్ని పనులు చేయకూడదు. తుమ్మలగుంట చెరువులో అవి చేశారు. వాటిపై యాక్షన్ తీసుకుంటాం' అని మంత్రి నారాయణ అన్నారు.

- తిరుపతిరూరల్/చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

'పెంచలకోన'లో కనీస వసతులు కల్పించండి



వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని రాపూరు మండలం పెంచలకోనలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో భక్తులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం అసెంబ్లీలో కోరారు. 'ఈ ఆలయానికి ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.13 కోట్ల వరకు ఆదాయం వస్తున్నా భక్తుల మనోభావాలకు తగ్గట్టు వసతులు లేవన్నారు. భక్తులకు సరిపడా వసతి గృహాలు నిర్మించడంతోపాటు ఆదురుపల్లి-పెంచలకోన రోడ్డును డబుల్ రోడ్డుగా చేయాలన్నారు. కొండపై నుంచి వచ్చే స్వచ్ఛమైన నీటిని చెక్‌డ్యాం కట్టి భక్తులకు తాగునీటి అవసరాలు తీర్చవచ్చని సూచించారు. పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే ఆలయానికి రాబడి మరింత పెరుగుతుందన్నారు. వెయ్యి మంది భక్తులు ఒకేసారి భోజనం చేసేలా వంటశాలను నిర్మించాలన్నారు.

- వెంకటగిరి, ఆంధ్రజ్యోతి

'కూటమి' చెంతకు కార్పొరేటర్లు

- విజయవాడకు 12మంది పయనం
- నేడు మంత్రులు లోకేశ్, అనగానిని కలిసేందుకు అపాయింట్మెంట్
- టచ్‌లో మరో ఏడుగురు, ఇప్పటికే కూటమిలో ఆరుగురు
- 25 మంది బలంతో అవిశ్వాస తీర్మానానికి..

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్లు దాటాక అవిశ్వాస తీర్మానం పెట్టేలా పురపాలక చట్టానికి గురువారం అసెంబ్లీలో ప్రభుత్వం సవరణ చేసిన నేపథ్యంలో తిరుపతిలోని కూటమి నాయకులు వేగంగా పావులు కదుపుతున్నారు. వైసీపీ కార్పొరేటర్లు కూటమి ముఖ్యనేతలను కలిసేందుకు విజయవాడకు వెళ్లారు. రాష్ట్ర మంత్రి పార్థసారధిని కలిసినట్టు తెలుస్తోంది. ఇక, మంత్రులు నారా లోకేశ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అపాయిమ్మెంట్ శుక్రవారం తీసుకున్నట్టు సమాచారం. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు.. మహిళా కార్పొరేటర్ల కుటుంబసభ్యులు పొన్నాల చంద్ర, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కుడితి సుబ్రమణ్యం, పెంచలయ్య, దూది కుమారి, సీకే రవి, అన్నా అనిత, అన్నా సంధ్య, ఆదం లీలావతి తదితరులు విజయవాడకు వెళ్లినవారిలో ఉన్నట్టు సమాచారం. తన కుమార్తెను మేయర్ చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న అన్నా రామచంద్రయ్య కూడా వీరితో వెళ్లారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతానికి చెందిన ఓ సీనియర్ యువ కార్పొరేటర్, సింగాలగుంటకు చెందిన మరో కార్పొరే టర్లు అసంతృప్తితో ఉన్న ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లను ఏకం చేసేపనిలో ఉన్నారు. విజయవాడకు వెళ్లినవారితో నిరంతరం టచ్‌లో ఉంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కూటమి పార్టీల్లో ఉన్న ఆరుగురితో కలిపి 25 మంది కార్పొరేటర్ల బలం పెరుగుతుంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే కూటమి నెగ్గే అవకాశం ఉంటుంది. ఈ బాధ్యతను రెండు పార్టీలతో సత్సంబంధాలు కలిగి, గత ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన తుడా మాజీ చైర్మన్‌కు అప్పగించనున్నట్టు తెలుస్తోంది.

● 50 డివిజన్లున్న తిరుపతి కార్పొరేషన్‌కు మూడున్నరేళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. నామినేషన్ ఉపసంహరణ సమయంలో వివాదం జరిగి ఒక డివిజన్‌కు ఎన్నిక ఆగిపోయింది. మిగిలిన 49 డివిజన్లలో అధికార బలంతో 28 డివిజన్లను ఏకగ్రీవాలు చేసుకున్నారు. తక్కిన 21 డివిజన్లకు ఎన్నికలు జరిగితే ఒక్క డివిజన్లోనే టీడీపీ జెండా ఎగురవేసింది. దొంగ ఓట్లతో వైసీపీ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. ఎన్నికల ముందు డిప్యూటీ మేయర్ అభినయ్ తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. అంతకుముందు నాయక్ అనే కార్పొరేటర్ మృతిచెందారు. అంటే మూడు డివిజన్లకు కార్పొరేటర్లు లేరు. మిగిలిన 47 డివిజన్లలోని కార్పొరేటర్లలో ఆధిపత్యం ఎటువైపుంటే వారికే మేయర్ కుర్చీ దక్కుతుంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఐదుగురు కార్పొరేటర్లు వైసీపీని వీడి ఇద్దరు టీడీపీలోకి, ముగ్గురు జనసేనలోకి మారారు. కొత్తగా చేరబోయే కార్పొరేటర్లతో కూటమి ప్రభుత్వానికి సరిపడా మెజారిటీ ఉండబోతోంది. చట్టసవరణ నేపథ్యంలో మేయర్ డాక్టర్ శిరీష అవిశ్వాసానికి మానసికంగా సిద్ధపడినట్టు తెలుస్తోంది.



డీఎంఏకి ఏమైంది..?

విచారణ ఎదుర్కొంటున్న వర్మ, చిట్టిబాబుపై ప్రేమ

తిరుపతిలో పోస్టింగ్ ఇచ్చేందుకు పరిశీలించమని కమిషనర్‌కు లేఖ

తిరుపతి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలకసంస్థలో అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న పూర్వ అధికారులపై డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) హరి నారాయణ అవ్యాజమైన ప్రేమను ప్రదర్శిస్తుండడం ఆశ్చర్యం గొలుపుతోంది. మంత్రి నారా లోకేశ్‌కు అందిన ఫిర్యాదులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆదేశాలతో డీఎంఏ విచారణకు ఆదేశించారు. అనంతపురం రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ నేతృత్వంలో 9 మంది సభ్యులతో కమిటీని నియమించారు. గతంలో రెవెన్యూ ఆఫీసర్ (ఆర్వో)గా పనిచేసిన కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబుతో పాటు డీఈ విజయకుమార్ రెడ్డిపై వారం రోజులుగా లోతైన విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఎంఏ పంపిన లేఖ మున్సిపల్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తిరుపతి ఆర్వో నుంచి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిపాలనాధికారిగా బదిలీ అయిన కేఎల్ వర్మను ఆరోగ్య సమస్యలతో, అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ ఏవోగా బదిలీ అయిన మేనేజర్ చిట్టిబాబును వ్యక్తిగత కారణాలపై తిరిగి తిరుపతి కార్పొరేషన్‌కు తీసుకునేందుకు పరిశీలించాలని కమిషనర్ మౌర్యకు డీఎంఏ లేఖ రాయడం అందరినీ విస్తుపోయేలా చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అవినీతి ఆరోపణలున్న అధికారులపై నెలరోజుల క్రితం డీఎంఏ బదిలీ వేటు వేశారు. వారిపై ఆర్డీ నేతృత్వంలో విచారణకు ఆదేశించింది కూడా ఆయనే. అలాంటిది ఆ అధికారులను తిరిగి చేర్చుకోమని చెప్పడం కూడా ఆయనే కావడం పలు విమర్శలకు తావిస్తోంది. ఓవైపు విచారణ జరుగుతుండగా మరోవైపు వారిని విధుల్లో చేర్చుకోమని లేఖ రాయడం వెనుక కొందరు అధికార పార్టీ పెద్దల ప్రమేయం ఉందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరి కమిషనర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

ఇద్దరు స్నేహితులను కాపాడి..!

- అసువులు బాసిన మరో మిత్రుడు
- మామండూరు వద్ద వాగులో ప్రమాదం





ప్రమాదానికి ముందు వాగులో స్నేహితులు సరదాగా తీసుకున్న ఫొటో - మృతి చెందిన హేమాద్రి

రేణిగుంట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాగులో మునిగిపోతున్న ఇద్దరు స్నేహితులను కాపాడాడు. ఆ క్రమంలో తాను నీట మునిగి మృత్యుఒడికి చేరాడు 20 ఏళ్ల హేమాద్రి. రేణిగుంట మండలం మామండూరు వద్ద వాగులో గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కడప జిల్లా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగరాజు కుమారుడు హేమాద్రి(20).. తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో బీఏ ఫైనలియర్ చదువుతున్నారు. తన ఎనిమిది మంది స్నేహితులతో కలిసి గురువారం మామండూరు అతిథిగృహం వద్దకు వచ్చారు. కొంతసేపు స్నేహితులంతా సరదాగా గడిపారు. ఆ తర్వాత ఈత కొట్టడానికి సమీప అటవీ ప్రాంతంలోని వాగు వద్దకు వెళ్లారు. ఈ వాగులోకి దిగి నడుము లోతులో ఉండే ప్రాంతంలో సరదాగా నీటిలో మునుగుతూ ఉన్నారు. ఈ క్రమంలో ఇద్దరు స్నేహితులు లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లారు. ఈత రాక వారు మునిగిపోతుండడం గుర్తించిన హేమాద్రి.. తనకు ఈత రాక పోయినా తన స్నేహితులను కాపాడడానికి విఫలప్రయత్నం చేశారు. ఎట్టకేలకు ఇద్దరు స్నేహితులను కాపాడిన హేమాద్రి.. ఆ లోతు గుంతలో చిక్కుకుని మునిగిపోయారు. మిగిలిన వారు విలపిస్తూ సమీపంలోని స్థానికులను కలిసి తమ స్నేహితుడిని కాపాడాలని కోరారు. ఈ ప్రమాద సమాచారం తెలిసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాగులో మునిగిపోయిన హేమాద్రి కోసం గాలించారు. కొంతసేపటి తర్వాత మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి, కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మత్స్యకార భరోసా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ పథకం కింద 3,786 మంది లబ్దిదారులకు రూ.7.57 కోట్ల సహాయం అందనుందన్నారు.చేపల వేట నిషేధ కాలంలో సముద్ర మత్స్యకారుల కుటుంబాలకు రూ.10,000 పెంచి రూ.20 వేల ఆర్థిక సాయం అందించనుందన్నారు. పులికాట్ సరస్సులో చేపల వేటపై ఆంధ్ర, తమిళనాడు మత్స్యకారుల మధ్య తలెత్తిన వివాదం పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆక్వా రైతులకు పవర్ సబ్సిడీపై త్వరలో మార్గదర్శకాలు వస్తాయన్నారు. పులికాట్ ముఖద్వారం వద్ద పూడిక తీత పనులకు అనుమతులు వచ్చాయని చెప్పారు. తడ, సూళ్లూరుపేట ప్రాంతాల్లో ఆక్వా, మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. పులికాట్ సరస్సులో చేపలవేటపై ఆంధ్ర, తమిళనాడు మత్స్యకారుల మధ్య వివాదం పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పలువురు ఆక్వా, మత్స్య రైతులకు, నేతలకు సన్మానం చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజ, మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు జీవరత్నం, పులికాట్ సరస్సు మత్స్యకారుల సంఘం నేత బొమ్మన శ్రీధర్, హేచరీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ పనులను వేగవంతం చేయండి

జిల్లాలో రిజర్వాయర్ పనులను వేగవంతం చేసేలా దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం బాలాజీ, మల్లెమడుగు రిజర్వాయర్ల పెండింగ్ పనులపై ఆయన నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి సాగు, తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు, జీఎన్.ఎస్ఎస్ ఎస్ఈ మదనగోపాల్, తెలుగుగంగ ప్రాజెక్టు ఈఈ (వెంకటగిరి) రాధాకృష్ణమూర్తి, తిరుపతి మైనర్ ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం కుటుంబంపై ఆరోపణలు మానుకో



తమ తండ్రికి తమ్ముడు రామ్మూర్తితో కలిసి చంద్రబాబు క్రతువు నిర్వహిస్తున్న ఫొటోను చూపుతున్న రవి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కుటుంబంపై ఆరోపణలు చేయడం మానుకో అంటూ మాజీ సీఎం జగన్‌కు శాప్ చైర్మన్ రవినాయుడు సూచించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల ఆయన పాలన చూసిన ప్రజలు అసహ్యించుకుని 11 సీట్లకే పరిమితం చేసినా సిగ్గురాలేదన్నారు. చంద్రబాబు తన తల్లిదండ్రుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా, వారి ఇష్టానుసారమే స్వగ్రామంలో ఉంచారని చేశారు. తమ్ముడు రామ్మూర్తినాయుడు అంత్యక్రియలు చంద్రబాబు దగ్గరుండి పూర్తిచేసిన సంగతి తెలుసుకోవాలన్నారు. సొంత చెల్లెలు, తల్లిపై కేసులు పెట్టించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర' క్రీడల్లో జరిగిన అవినీతిపై విచారణకు సీఐడీకి లేఖ రాశామని, త్వరలో దర్యాప్తు ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కృష్ణయాదవ్, ఆర్పీ శ్రీనివాసులు, సందీప్, లోకేష్, రంజిత్ పాల్గొన్నారు.



బోట్లలో వెళ్లి బాధితులను కాపాడుతున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

వరదల్లో చిక్కుకుంటే..!

భారీ వర్షాలు. అకస్మాత్తుగా వరదొచ్చింది. ఎందరో నీటిలో మునిగిపోతున్నారు. అంతలో ఎన్డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. లైఫ్ జాకెట్లు వేసుకుని, బోట్లలో నీళ్లలోకి వెళ్లారు. మునిగిపోతున్న వారిని కాపాడి.. ఒడ్డుకు చేర్చారు. సీపీఆర్ చేశారు. ప్రాణాలను కాపాడారు. ఇదంతా సూళ్లూరుపేట మండలం కోటపోలూరు పెద్దన్న చెరువులో గురువారం మాక్‌డ్రిల్. వరదలు, విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? నీటిలో చిక్కుకొన్న వారిని ఎలా రక్షించాలి? లైఫ్ జాకెట్లు వేసుకుంటే నీటిలో ఎంతవరకు ఉండొచ్చు.. వంటి అంశాలపై ఎన్డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సుమన్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ ద్వారా ప్రజలకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎస్‌వీ నరసింహారావు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, కోటపోలూరు సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



కాపాడిన వారిని బయటకు తీసుకొస్తున్న సిబ్బంది

మాక్ డ్రిల్‌లో పాల్గొన్న వారు


పల్లెపల్లెనా బెల్టు షాపుల జోరు

పగలు రూ.10 నుంచి రూ.20 అదనం

రాత్రిళ్లు రూ.30 నుంచి 150 దాకా అధికం

తెగ తాగిస్తున్నారు!

- మద్యం షాపులకు అనుబంధంగా అనధికారిక గదులు



మద్యం అక్రమ వ్యాపారానికి 'బార్లా' తెరిచారు. దుకాణాల పక్కనే అనధికార గదులు.. పల్లెల్లో బెల్టు షాపులు పెట్టి తెగ తాగిస్తున్నారు. కొన్ని చోట్ల మందు బాబుల సిట్టింగ్‌కు సదుపాయాలు కల్పించారు. మరికొన్నింటికి కూల్ డ్రింక్ షాపుల పేరిట బోర్డులు పెట్టి లోపల మద్యం తాగిస్తున్నారు. బెల్టు షాపుల్లో టైమింగ్‌ను బట్టి అదనపు ధరలు మారుతుంటాయి. ఎక్సైజ్, పోలీసు శాఖలు స్పందించకపోవడంతో నామమాత్రపు కేసులకే పరిమితమవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి: పోటాపోటీగా అనుబంధ గదులు

తిరుపతిలో 24 మద్యం షాపులకు అనుబంధంగా మందుబాబులు తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. వీటికి తోడు 18 బెల్టు షాపులున్నాయి. రూరల్‌లో 12 మద్యం షాపులకూ సమీపాల్లో తాగేందుకు గదులు ఏర్పాటు చేశారు. పక్కనే కూల్ డ్రింకు షాపుల్లోనూ తాగిస్తున్నారు. రూరల్ మండలంలో 17 బెల్టు షాపులున్నట్టు అంచనా. పగలు క్వార్టర్‌పై రూ.10-20 వరకూ.. రాత్రి పది నుంచీ ఉదయం పది మధ్య బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ రేటు పెంచి విక్రయిస్తున్నారు.

రేణిగుంట: రాత్రిళ్లు ధరల ఘాటు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో.. తొమ్మిదింటి వద్ద అనధికార గదుల్లో మద్య తాగిస్తున్నారు. రాత్రిళ్ళు షాపులు మూతపడ్డాక మాత్రం అనధికారిక మద్యం అధిక ధరలతో ఘాటెక్కుతోంది. బాటిల్‌పై రూ. 50 నుంచీ రూ. 150 దాకా పెంచి విక్రయిస్తున్నారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు జోరుగా నడుస్తున్నాయి. ఉదాహరణకు.. అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఒకే మహిళ రెండు సార్లు గాజులమండ్యం పోలీసులకు పట్టుబడింది.



శ్రీకాళహస్తి బస్టాండు ఎదురుగా మద్యం షాపు పక్కనే తాగించడానికి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: సకల సదుపాయాలు

శ్రీకాళహస్తిలోనూ పదింటికి గాను 9 షాపుల పక్కనే అనుబంధ గదుల్లో మందుబాబులకు సకల సదుపాయాలు కల్పించారు. మరో షాపునకూ మరో నాలుగైదు రోజుల్లో అనధికార గదిని అందుబాటులోకి తెచ్చేలా సిద్ధం చేస్తున్నారు. దుకాణాలు మూసేశాక దొంగచాటు అమ్మకాలతో ధరలు పెంచుతున్నారు. స్థానికుల ఫిర్యాదుతో రెండు వారాల కిందట పానగల్ రైల్వే గేట్ సమీపంలో బెల్టు షాపుపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు.

నాగలాపురం: అనధికారిక బార్లు



నాగలాపురంలో బహిరంగంగానే అనధికార బార్లు

నాగలాపురంలో రెండు, సురుటిపల్లి, టీపీ కోటల్లో ఒక్కొక్కటి చొప్పున మండలంలో నాలుగు లైసెన్సుడ్ మద్యం షాపులున్నాయి. వాటి పక్కనే అనధికారికంగా బార్లు నడుస్తున్నాయి. బహిరంగంగానే వీటిని నిర్వహిస్తుండడం విశేషం. నందనం గ్రామంలోని బెల్టు షాపులో బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరతో విక్రయిస్తున్నారు. ఈ షాపుపై పోలీసులు కేసు నమోదు చేసినా మళ్ళీ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు.

డక్కిలి: బారుల్లా కూల్ డ్రింక్ షాపులు

డక్కిలి, మోపూరు రోడ్డు, దగ్గవోలు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు లైసెన్సుడ్ షాపులున్నాయి. డక్కిలి షాపు దగ్గరగా నాలుగైదు కూల్ డ్రింకు షాపులున్నాయి. మిగిలిన షాపుల పక్కనే ఒకటి రెండు చొప్పున కూల్ డ్రింకు షాపులు ఏర్పాటయ్యాయి. ఆ షాపుల్లోనే మందు బాబులు సిట్టింగ్ వేసి తాగుతున్నారు. దీని కోసం కూల్ డ్రింకు షాపు నిర్వాహకులు మద్యం షాపు వారికి రోజుకు రూ. వెయ్యి నుంచీ రూ. 1500 చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నట్టు ఆరోపణలున్నాయి. అంటే, మందుబాబులు తాగేందుకు వీరు 'ప్రత్యేక ఛార్జీ' వసూలు చేస్తున్నారు. ఇక, బెల్టుషాపుల్లో బాటిల్‌పై పగలు రూ.20-30.. రాత్రిళ్ల రూ.50 ఎక్కువ ధరతో అమ్ముతున్నారు.



డక్కిలిలో వైన్‌షాపు పరిసరాల్లో కూల్‌డ్రింక్ షాపు వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

బెల్టుషాపులకు 'కోట' జిల్లాలోనే అత్యధికంగా బెల్టు షాపులు కోట మండలంలో ఉన్నాయి. ఏడు లైసెన్స్‌డ్ షాపుల్లో.. కొన్నింటి పక్కన మద్యం తాగేందుకు గదులు ఏర్పాటయ్యాయి. ఇక, 21 పంచాయతీల పరిధిలో 150 దాకా బెల్టు షాపులున్నాయి. వీటిల్లో బాటిల్‌పై రూ.50 నుంచీ రూ. 70 చొప్పున అధిక ధరతో విక్రయిస్తున్నారు. అయినా ఎక్సైజ్, పోలీసు దాడులు, తనిఖీలు లేవిక్కడ.

ఎక్సైజ్ గుర్తించిన బెల్టు షాపులే 930

జిల్లాలో 227 లైసెన్సుడ్ మద్యం షాపులున్నాయి. వీటిలో 182 దుకాణాలకు అనుబంధంగా గదులున్నట్టు అంచనా. ఇక, 930 బెల్టు షాపులున్నాయని ఎక్సైజ్ అధికారులు గుర్తించినట్టు సమాచారం. బెల్టు షాపుల నిర్వాహకులు మద్యం దుకాణాల నుంచే కాకుండా తమిళనాడు నుంచీ చీప్ లిక్కర్ తెచ్చి అమ్ముతున్నారనే ఆరోపణలున్నాయి. గత 15 రోజుల వ్యవధిలో ఎక్సైజ్ అధికారులు 35 కేసులు నమోదు చేసి 52 మందిని అరెస్టు చేయడంతో పాటు 430 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేశారు. దీన్నిబట్టి జిల్లాలో మద్యం అక్రమ వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

దొరవారిసత్రం: బెల్టుకు వేలం

దొరవారిసత్రం మండలంలో లైసెన్సుడ్ మద్యం దుకాణాలు రెండూ వైసీపీ అనుకూల వ్యక్తులకు దక్కాయి. అధికార పార్టీ నాయకులకు భయపడి వారు బెల్టు షాపుల జోలికి వెళ్లడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని అధికార పార్టీ నాయకులు కొందరు బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. ఈ షాపులకు సూళ్లూరుపేటలో టీడీపీ కీలక నేత పరిధిలోని నాలుగు దుకాణాల నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. ఇటీవల శ్రీధనపల్లిలో బెల్టు షాపు నిర్వహణకు ఏకంగా వేలం పాటలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ వేలంలో ఓ వ్యక్తి రూ. 1.60 లక్షలకు షాపు దక్కించుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో ఎక్సైజ్, పోలీసు యంత్రాంగాలు రంగంలోకి దిగి విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. దీంతో బెల్టు షాపులకు మద్యం సరఫరా తాత్కాలికంగా ఆగింది. వేడి తగ్గగానే 45 బెల్టు షాపుల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

అన్ని చోట్లా ఇలానే..

- చంద్రగిరి మండలంలో 7 మద్యం షాపులుంటే 16 మంది అధికార పార్టీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి ఒక షాపు నిర్వహణ తీసుకున్నారు. వారే బెల్టు షాపులకు తెర లేపారని సమాచారం. మండలాన్ని రెండుగా విభజించి ఒక్కో ప్రాంతానికి ఇద్దరేసి నాయకులు బెల్టు షాపుల దందా నడిపిస్తున్నారని ఆరోపణలున్నాయి. చంద్రగిరిలో ఓ షాపు పక్కనే అనుబంధ గది ఏర్పాటు చేయగా, పోలీసులు తనిఖీ చేసి హెచ్చరించారు. కొన్ని చోట్ల షాపుల కోసం గదులు అద్దెకు ఇచ్చిన యజమానులే వాటి పక్కన కూల్ డ్రింక్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. మద్యం షాపులో కంటే బాటిల్‌పై రూ.10, రూ. 20 అదనపు ధరతో విక్రయిస్తున్నారు. మండలంలో 20 బెల్టు షాపులున్నాయని అంచనా.
- పాకాలలో ఐదు షాపులుంటే 27 మంది రాజకీయ నాయకులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. మండలంలో పదిహేను వరకూ బెల్టు షాపులున్నాయి. క్వార్టర్ మీద రూ. 10 నుంచీ రూ. 15 వరకూ అదనం.
- చిన్నగొట్టిగల్లు మండలంలో మూడు వైన్ షాపులున్నాయి. ఈ షాపుల్లో మద్యం కొని కొందరు బాటిల్‌పై రూ. 20 నుంచీ రూ. 50 దాకా ధర పెంచి గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. 13 గ్రామాల్లో ఇలాంటి ఏర్పాట్లున్నాయి.
- నాయుడుపేట మండలంలో 13 షాపుల పక్కనా అనధికారిక గదులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో 20 బెల్టు షాపులున్నట్టు అంచనా. వీటిల్లో బాటిల్‌పై రూ.30 నుంచీ రూ. 50 వరకూ ధరలు పెంచి అమ్ముతున్నారు. బెల్టు షాపుల ఏర్పాటు వెనుక నాయకుల ప్రమేయం ఉంది.
- పెళ్లకూరు మండలంలో రెండు షాపులున్నాయి. ఇక, బెల్టు షాపులపై స్థానికుల ఫిర్యాదుతో తాళ్వాయిపాడు గ్రామంలో ఎక్సైజ్, పోలీసు అధికారులు తనిఖీలు చేసి ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. వారి నుంచీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.
- గూడూరులో 12 షాపులున్నాయి. వీటిల్లో పలువురు మద్యం కొని.. గ్రామాల్లో బాటిల్‌పై రూ.50 పెంచి విక్రయిస్తున్నారు. ఇలాంటి వారిపై ఎక్సైజ్ పోలీసులు ఐదు కేసులు నమోదు చేశారు. పట్టణంలోని మూడు షాపుల వద్ద మాత్రం పక్కనే కూల్ డ్రింకు షాపులు వెలిశాయి. వాటిలో మద్యం విక్రయిస్తున్నారు.
- వాకాడు మండలంలో నాలుగు మద్యం దుకాణాల పక్కనా కూల్ డ్రింకు షాపులు పెట్టారు. గ్రామానికి రెండు మూడు బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి. మద్యం షాపులన్నీ సిండికేట్‌గా మారాయని, నిర్వాహకులే బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. బెల్టు షాపుల్లో ఎమ్మార్పీ కంటే రూ.50-80 అదనంగా విక్రయిస్తున్నారు.
- చిల్లకూరు మండలంలోని 6 షాపుల పక్కనా అనధికారిక షాపులు ఏర్పాటయ్యాయి. బాటిల్‌పై రూ. 50 పెంచి అమ్మేస్తున్నారు.
- చిట్టమూరు మండలంలో నాలుగు దుకాణాల పరిధిలోని గ్రామాల్లోనూ బెల్టు షాపులు నడుస్తున్నాయి. బాటిల్‌పై రూ. 50 ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.
- బాలాయపల్లి మండలంలో మూడు మద్యం షాపుల పక్కనా అనధికారిక బార్ రూమ్‌లు వెలిశాయి. ప్రతి గ్రామంలో రెండు చొప్పున బెల్టు షాపులు ఏర్పాటయ్యాయి.
- వెంకటగిరిలో తొమ్మిది షాపుల పక్కనే ఒక్కో కూల్ డ్రింక్ షాపు కొలువు దీరాయి. వీటిల్లోనే మందు బాబులు మద్యం తాగుతున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు సరేసరి. ఇటీవలే ముదంపల్లిలో బెల్టు షాపును గుర్తించి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదుచేశారు.
- పుత్తూరులో ఏడు షాపుల వెనుక మద్యం తాగేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఓ వైసీపీ నాయకుడు విచ్చలవిడిగా బెల్టు షాపులు నడుపుతుండగా.. అతడికి అధికార పార్టీ నాయకులు సహకరిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఐదు లైసెన్సుడ్ షాపుల పక్కన అనధికారిక గదుల్లో మద్యపానం నడుస్తోంది. 15 గ్రామాల్లో బెల్టు షాపులుండగా, అధిక రేట్లకు విక్రయిస్తున్నారు.



బుచ్చినాయుడు కండ్రిగలో వైన్‌షాపు పక్కనే తాగడానికి ఏర్పాట్లు

కేవీబీపురం మద్యం దుకాణం వెనుకవైపు ఎంచక్కా పందిరి వేసి, టేబుళ్ల తరహాలో బండలు అమర్చి మద్యం తాగడానికి ఏర్పాటు చేశారు.



కేవీబీపురంలో వైన్‌షాపు పక్కన ఖాళీ స్థలంలో మందు బాబుల కోసం బండలతో టేబుళ్ల తరహాలో వేశారిలా

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి



శ్రీకాళహస్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రాజ్‌కుమార్(30) అనే సచివాలయ ఉద్యోగి మృతి చెందారు. శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. రేణిగుంటకు చెందిన రాజ్‌కుమార్ శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని నాయుడుపేట-తిరుపతి జాతీయ రహదారి దాటి అవతలి వైపు వెళుతుండగా తిరుపతి నుంచి నాయుడుపేట వైపుగా వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజ్‌కుమార్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కరకంబాడి వద్ద ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూరాజ్‌కుమార్ అక్కడ మృతి చెందారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

అమరావతి,నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు టీడీపీ నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. నాగార్జున వర్సిటీ వద్ద రెయిన్‌ట్రీ పార్క్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది.

బీర్ల లారీ బోల్తా

బీర్ల లారీ బోల్తాపడిన ఘటన ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పాండిచ్చేరి నుంచి 1800 కేసుల బీరు బాటిళ్ల లోడుతో వైజాగ్‌కు ఓ లారీ బుధవారం బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున తడ మండలం అక్కంపేట సమీపంలోకి వచ్చేసరికి వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తాపడింది. డ్రైవర్ కన్నన్‌సేతుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సురేష్, కోటేశ్వరరావు ఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీలో ఉన్న బీరు కేసులన్నీ చాలా వరకు దెబ్బతిన్నాయి. బీర్ల లారీ బోల్తా పడిందని తెలిసి చుట్టుపక్కల వాళ్లు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే పోలీసులు అక్కడకు చేరుకొని వారిని తరిమేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, లారీని ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు.

- తడ, ఆంధ్రజ్యోతి



ఆర్‌ఆర్‌బీ పరీక్షలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), నవంబరు21 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగనున్న ఆర్‌ఆర్‌బీ అర్హత పరీక్షల అభ్యర్థుల కోసం ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక రైళ్ల నడపనున్నట్లు సీపీఆర్‌వో శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు-సికింద్రాబాదు, కరీమ్‌నగర్-కాచిగూడ, కాచిగూడ-కర్నూలు సిటీ, హుబ్లీ-కర్నూలు సిటీ, నాందేడ్-తిరుపతి, కాకినాడ టౌన్-తిరుపతి మధ్య రైళ్లు నడుపుతామని తెలిపారు.

- నాందేడ్-తిరుపతి మధ్య 23న ప్రత్యేక రైలు(07105) నాందేడ్‌లో మధ్యాహ్నం 12.25 గంటలకు బయలుదేరి ముడికేడ్, ధర్మాబాదు, నిజామాబాద్, కామారెడ్డి, కాచిగూడ, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్‌సిటీ, డోన్, అనంతపురం, ధర్మవరం, కదిరి, మదనపల్లె రోడ్డు, పాకాల స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 6.25 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది.
- తిరుపతిలో ప్రత్యేక రైలు (07106) 24వ తేదీ మధ్యాహ్నం 3.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు 8.35 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది.
- కాకినాడటౌన్‌లో 23వ తేదీ ప్రత్యేక రైలు(07107) ఉదయం 6.30 గంటలకు బయలుదేరి సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, న్యూగుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, బిట్రగుంట, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా అదే రోజు సాయంత్రం 6.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది.
- తిరుపతిలో 24వ తేదీ ప్రత్యేక రైలు(07108) రాత్రి 7.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.45 గంటలకు కాకినాడటౌన్‌కు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు ఈనెల 23, 24 తేదీలతో పాటు 26, 28, 29 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.

రూ.300 దర్శన టికెట్లు 25న విడుదల

తిరుమల, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలకు సంబంధించిన తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ ఈనెల 25వ తేదీన విడుదల చేయనుంది. ఉదయం 10 గంటలకు ఈ కోటాను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ 'టీటీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' ద్వారా విడుదల చేస్తారు.అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని టీటీడీ వసతి సముదాయాల్లో ఖాళీలను కూడా విడుదల చేస్తారు. మరోవైపు 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ, 11 గంటలకు శ్రీవాణిట్రస్టు టికెట్లు జారీ చేయనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు

తిరుమల, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.08 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ వివరాలను టీటీడీ గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 59,231 మంది శ్రీవారిని దర్శించుకున్నారు.

సైబర్ ఉచ్చులో ఎరువుల వ్యాపారి

- నిమిషాల వ్యవధిలో రూ 13.5 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ ఉచ్చులో పడి తిరుపతికి చెందిన ఓ ఎరువుల వ్యాపారి రూ.13.5 లక్షలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటకు చెందిన ఎరువుల వ్యాపారి (మార్కెటింగ్) జయరామిరెడ్డికి తిరుపతిలో ఐసీఐసీఐ బ్యాంకులో ఖాతా ఉంది. అకౌంటు వుంది. ఈయన ప్రమేయం లేకుండానే 'వీఐపీ ఈ7 ఇన్వెస్ట్‌మెంట్ అలియన్స్ లెర్నింగ్' వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ అయ్యారు. ఈ గ్రూప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్‌ను డౌన్‌లోడ్ చేశారు. అప్పుడు ఆయన మొబైల్‌లో ఫేక్ 'సీడబ్ల్యూఏ మ్యానేజ్' యాప్ కూడా డౌన్‌లోడ్ అయింది. అందులో ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ చేశారు. అనంతరం అతడి ఖాతాలో రూ.24.3 లక్షలు కనిపించాయి. ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేయబోగా యాప్ కనిపించకుండా పోయింది. తాను మోసపోయాయని తెలుసుకున్న ఆయన.. రూ.13.5 లక్షలు నష్టపోయినట్లు తిరుపతి రూరల్ పోలీసు స్టేషనులో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీకోసం పనిచేసేవారికి గుర్తింపు: టీడీపీ



ధనుంజయగౌడ్‌ను సన్మానిస్తున్న తానంకి నానాజీ, టీడీపీ నేతలు

చిల్లకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో పార్టీ కోసం పనిచేసేవారికి గుర్తింపు ఉంటుందని టీడీపీ సీనియర్ నేత తానంకి నానాజీ అన్నారు. టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మండల కేంద్రమైన చిల్లకూరు గ్రామానికి చెందిన ధనుంజయగౌడ్‌ను నియమించడంతో గురువారం ఆయన నివాసంలో పలువురు పార్టీ నాయకులు సన్మానించారు. నానాజీ మాట్లాడుతూ పార్టీలో పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు టీడీపీ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ధనుంజయగౌడ్ మాట్లాడుతూ తనను రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన సీఎం చంద్రబాబుకు, అందుకు సహకరించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కి, తానంకి నానాజీకి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పెనుబోలు జానకిరామిరెడ్డి, బెల్లంకొండ రాజేంద్ర, మల్లికార్జున్, నవీన్‌చంద్ర, సుబ్బయ్య, బాలరమణయ్య, వినోద్, సురేష్‌బాబు, సుబ్బారావు, రవికుమార్, శ్రీనివాసులు, శివ, పలువురు గౌడసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడల పట్ల
ఆసక్తి పెంచేందుకు చర్యలు
- విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ భాస్కరరావు



టేబుల్ టెన్నిస్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న వీసీ భాస్కరరావు

గూడూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ భాస్కరరావు అన్నారు. గురువారం స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ కళాశాలలో రెండురోజుల పాటు జరిగే విక్రమ సింహపురి ఇంటర్ కాలేజ్ గేట్ గేమ్స్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులోని క్రీడానైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఈ తరహా పోటీలు దోహదపడుతాయన్నారు. విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ సునీత, ప్రిన్సిపాల్ శివప్రసాద్, నారాయణరాజు, వెంట్రాయులు, వెంకటేశ్వర్లు, శ్రీధర్మశర్మ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు
నాణ్యమైన విద్యుత్ అందించాలి



మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసరావు, పక్కనే శేఖర్, మురళి, జగదీష్

సూళ్లూరుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని డిస్కం ఈఈ వై.శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో డివిజన్ స్థాయి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలినా, విద్యుత్ లైన్లు తెగి అంతరాయం కలిగినా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యుత్ విభాగంలో జరిగే ప్రమాదాల నివారణపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఈఈ శేఖర్, ఏఈఈలు మురళి, జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం ప్రాంగణంలో రెండోరోజైన గురువారం గుంటూరు, ప్రకాశం, నెల్లూరుజిల్లాల జోనల్‌మీట్ క్రీడాపోటీలు హోరాహోరీగా జరిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాలు, కళాశాలలకు చెందిన 680 మంది బాలురు ఈ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. గురువారం వాలీబాల్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయి. హ్యాండ్‌బాల్ పాఠశాల బాలుర విభాగంలో చిల్లకూరు విద్యార్థులు మొదటిస్థానం సాధించి విజేతలుగా నిలవగా, కోట విద్యార్థులు రెండవస్థానం సాధించారు. కళాశాల హ్యాండ్‌బాల్ బాలుర విభాగంలో కోట జట్టు మొదటిస్థానంలో నిలవగా, చిల్లకూరు జట్టు రెండవస్థానంలో నిలిచింది. ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీరేష్, రాజ్‌కుమార్‌ల పర్యవేక్షణలో ఆయా జిల్లాలకు చెందిన 17 జట్లు హోరాహోరీగా క్రీడలు ఆడుతున్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

సూళ్లూరుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఎరువుల దుకాణాలను గురువారం గూడూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.గోపీ నాయక్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినా, కాలం చెల్లిన మందులు ఉన్నా చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీల్లో సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం ఏవోలు కవిత, జ్యోతిర్మయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి

డక్కిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులను రేషన్ డీలర్లు ప్రతి నెలా సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకుల పంపిణీలో వినియోగదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, సీనియర్ సహాయకులు సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప గ్రామోత్సవం



కోట, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): కోట పట్టణంలో గురువారం అయ్యప్పగ్రామోత్సవం జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అయ్యప్పభక్తులు స్థానిక సోమేశ్వర ఆలయంలో పూజలు చేసి, అయ్యప్ప విగ్రహంతో గాంధీబొమ్మ సెంటర్‌నుంచి బజారుమీదుగా గోపాల్‌రెడ్డి విగ్రహం వరకు మేళతాళాలతో అయ్యప్ప గ్రామోత్సవం జరిగింది. అయ్యప్ప ఊరుగుతున్న సమయంలో భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అయ్యప్పను దర్శించుకొని కొబ్బరికాయలు కొట్టారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు



చిల్లకూరు, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కలవకొండలో వెలసివున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో స్వామివారి హుండీ లెక్కింపు నిర్వహించారు. భక్తులు చెల్లించిన కానుకలు 16నెలలకుగాను రూ.3,28,013 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌బాబు, ఈవో రవికుమార్, సురేంద్రరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, గ్రామస్థులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఉసిరి చెట్టుకు పూజలు

డక్కిలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో గురువారం డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వనభోజనాలు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, సుధీర్ బాబు, రాజగోపాల్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు లారీల ఢీ - ఒకరు మృతి

- ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతి చెందిన డ్రైవర్ పఠాన్

నాయుడుపేట టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రెండు లారీలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా... మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు...నాయుడుపేట-పండ్లూరు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ పంక్చర్ కావడంతో రోడ్డుపక్కన పెట్టి డ్రైవర్, క్లీనర్ టైరు మార్చేక్రమంలో అదే వైపు నుంచి వస్తున్న మరో లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ పఠాన్(55) అక్కడికక్కడే మృతిచెందగా, పక్కనే ఉన్న జగన్ తీవ్రంగా గాయపడ్డాడు. మరో లారీలో ఉన్న వెంకటేశ్వర్లు, అహ్మద్ రఫీలు కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్‌సిబ్బంది గాయాలపాలైన వారిని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకై నెల్లూరుకు తరలించారు. అదే సమయంలో హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, హైవే మొబైల్ పోలీస్ సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బస్సు, కారు ఢీ - తప్పిన పెను ప్రమాదం

పెళ్లకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు సమీపంలో 71వ జాతీయ రహదారిపై గురువారం బస్సు, కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ద్రాక్షరామం నుంచి శబరిమలైకి 40 మంది అయ్యప్ప భక్తులతో బస్సు వెళ్తుండగా శ్రీకాళహస్తి వైపు నుంచి నెల్లూరుకు వెళ్తున్న కారు తాళ్వాయిపాడు వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

బెల్టు దుకాణంపై దాడులు

వాకాడు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతరం దాడులు కొనసాగిస్తామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ప్రసాద్ అన్నారు. కోట మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామానికి చెందిన తోట శీనయ్య అక్రమంగా 10 మద్యం బాటిళ్లను అమ్ముతుండటంతో ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి పట్టుకున్నారు. సిబ్బంది రాజయ్య, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌ను కలిసిన బీజేపీ నాయకులు



సురేష్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న పార్థసారథి రెడ్డి, కృష్ణమూర్తి, సురేష్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని నెల్లూరులో గురువారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బీజేపీ నాయకులు బైరి పార్థసారథి రెడ్డి, ఆర్.కృష్ణమూర్తి, గండవరం సురేష్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా సురేష్‌రెడ్డిని కలిసి శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు.

పోస్టాఫీసుల్లో ఖాతాల కోసం ప్రత్యేక క్యాంప్‌లు

వాకాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు పోస్టాఫీసుల్లో కొత్తగా ఖాతా తెరవడానికి ఈ నెల 26 నుంచి గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహించనున్నామని ఎంపీడీవో అన్నపూర్ణరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, పోస్టల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ గూడూరు మణికన్నన్ తదితరులు పాల్గొన్నారు.

కలగా మిగిలిన క్రీడా వికాస భవనం

- కూటమి ప్రభుత్వంపైన

ఆశలు పెట్టుకున్న క్రీడాకారులు





గోడల వరకు కట్టి వదిలేసిన క్రీడా వికాస భవనం - 2018లో ఎమ్మెల్యే పాశిం ఆవిష్కరించిన శిలాఫలకం

కోట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంత మండలాల్లోని క్రీడాకారులకు ఆయా శిక్షణ ఇచ్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు పంపించాలన్న లక్ష్యంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ఎన్టీఆర్ క్రీడా వికాసకేంద్రం కలగా మిగిలిపోయింది. కోట పట్టణంలో 2018 డిసెంబరులో రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు భవన నిర్మాణం, మెటీరియల్‌కు రూ.2 కోట్లు విడుదల చేసింది. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో అప్పటి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చేతులమీదుగా శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారు. శాప్ అధికారుల పర్యవేక్షణలో పనులు పొందిన కాంట్రాక్టర్ ఆఘమేఘాలపై భవన నిర్మాణపనులు చేపట్టి గోడల వరకు నిర్మాణాలు జరిపి ఆ తరువాత బిల్లులు చెల్లించుకొని గిట్టుబాటు కాలేదని చేతులు ఎత్తేశారు. అటు తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ క్రీడా శిక్షణ భవన స్థితిగతులను పట్టించుకోలేదు. అప్పటి ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లినా పెడచెవిన పెట్టారు. దీంతో నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఈ క్రీడా భవనం మిగిలిపోయింది. ఈ భవన నిర్మాణం పూర్తయి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తే కోట, వాకాడు, చిట్టమూరు మండలాల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి క్రీడలపై ఆసక్తి పెంచవచ్చు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కోట ప్రాంతంలో ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటైతే ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దృష్టి సారించి ఈ భవనానికి మోక్షం కలిగిస్తే క్రీడాకారుల చిరకాల కోరిక నెరవేరుతుంది.

క్రీడా భవన నిర్మాణ పనులు వేగవంతం

- పాశిం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

కోటలో ఆగిపోయి ఉన్న క్రీడా భవన నిర్మాణ పనులపై దృష్టిపెట్టా. ఇందుకోసం శ్యాప్ చైర్మన్‌ను కలిశా. మరిన్ని నిధులు తీసుకువచ్చి ఈ శిక్షణ భవనాన్ని నిర్మించి మూడు మండలాల గ్రామీణ క్రీడాకారులకు అంకితం చేస్తా.

ఏటీఎంలలో భద్రత డొల్ల



తడ కెనరా బ్యాంక్ వద్ద, సూళ్లూరుపేట జూనియర్ కాలేజీ ఎదురుగా, నాయుడుపేట పాత వెంకటగిరి రోడ్డులో ఉన్న ఏటీఎంలకు బుధవారం రాత్రి భద్రతా సిబ్బంది లేని దృశ్యం

నాయుడుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలలో భద్రత డొల్లతనం బయటపడింది. ఏ ఏటీఎం చూసినా కనీస సిబ్బంది లేకపోవడం గమనార్హం. బుధవారం రాత్రి సమయంలో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పలు ఏటీఎంలను ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించింది. ఎక్కడా భద్రతా సిబ్బంది కనబడలేదు. ఏటీఎంలను గడ్డపారలతో పగులగొడుతున్నా బ్యాంక్ అధికారుల్లో చలనం కనబడటం లేదనేందుకు ఈ చిత్రాలే ఉదాహరణగా చెప్పవచ్చు. రహదారులలోనే ఇలా చోరీలకు ప్రయత్నాలు జరుగుతున్నా వారికి చీమకుట్టినట్లయినా లేదని, ఇకనైనా ఆయా ఏటీఎంలకు భద్రతా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే పాశిం



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం చంద్రబాబును గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని చిల్లకూరు, వాకాడు మండలాల్లోని తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.4.14 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నం పంచాయతీ గమ్మళ్లదిబ్బ నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.3.11కోట్లు, వాకాడు మండలం జమీన్‌కొత్తపాళెం పంచాయతీ తూపిలిపాళెం నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.66 లక్షలు, దుగరాజపట్నం పంచాయతీ కొండూరుపాళెం నుంచి బీచ్ వరకు బీటీ రోడ్డుకు రూ.37లక్షలు నిధులను మంజూరు చేశారని చెప్పారు. దీంతో చంద్రబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు.

చెంగాళమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి



చెంగాళమ్మ ఆలయంలో పూజకు వెళ్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ దంపతులు, న్యాయమూర్తి అనిల్‌కుమార్, ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి

సూళ్లూరుపేట, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలనంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, సూళ్లూరుపేట సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అనిల్ కుమార్, తహశీల్దార్ ఎస్‌వీ నరసింహారావు, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు ఉన్నారు.

26న ధర్నా విజయవంతం చేయాలి

గూడూరు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన తిరుపతిలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 26న దేశంలోని 500 జిల్లాల్లోని కలెక్టరేట్‌ల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాకు మద్దతు ప్రకటిస్తూ ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శ్రీరాములు, కాలేషా, చంద్రయ్య, రమేష్, పార్థయ్య, మునిరత్నంనాయుడు, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై ధర్నా

వెంకటగిరిటౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై 26వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వి.రమణయ్య అన్నారు. గురువారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం, స్త్రీ విముక్తి సంఘటన, ఏఐవైఎఫ్‌లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.బాలకృష్ణయ్య, సీఐటీయూ నియోజకవర్గ నాయకులు చెంగయ్య, చిన్న ఓబయ్య, కె.అజిత, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదులో ఇబ్బందులు లేకుండా చర్యలు

పెళ్లకూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అపార్ (ఆటో మెటిక్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిష్టర్) నమోదులో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాలల వద్ద ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో శంకరయ్య తెలిపారు. గురువారం మండలంలోని శిరసనంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మొబైల్ ఆధార్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అపార్ కోసం ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబును కలసిన ఎమ్మెల్యే విజయశ్రీ



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. గురువారం సాయంత్రం శాసనసభలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో చంద్రబాబును విజయశ్రీ కలసి పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను వినతిపత్రం రూపంలో ముఖ్యమంత్రికి అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వైద్యఖర్చులకు ఆర్థిసాయం



నగదు అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతిసేవాసంస్థ కార్యాలయంలో రమేష్‌బేకరి అధినేత రమేష్ సహకారంతో స్థానిక రామమందిరంలోని పూజారి నాగేశ్వరశర్మ కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం రూ.10వేలు ఆర్థికసాయంగా అందజేశారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న నాగేశ్వరశర్మ కుమార్తె వైద్య ఖర్చుల నిమిత్తం తమ సంస్థ ఆధ్వర్యంలో నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మురళీ నాయుడు, రాము, ప్రభాకర్‌కుమార్ నాయుడు, పి.శ్రీనివాసులు, శ్రీహరి కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నాగేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసాకు మంగళం: కిలివేటి



మాట్లాడుతున్న కిలివేటి సంజీవయ్య, పక్కన వైసీపీ నాయకులు

తడ, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులకు భరోసాగా ఇస్తున్న రూ.10వేలు కాకుండా దానిని రూ.20వేలు చేస్తామని టీడీపీ ఎన్నికలకు ముందు ప్రచారం చేసిందని, ప్రస్తుతం ఆ మత్స్యకార భరోసాకు టీడీపీ ప్రభుత్వం మంగళం పాడేసిందని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య విమర్శించారు. గురువారం ఓ ప్రైవేట్ హోటల్‌లో వైసీపీ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కిలివేటి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారుల జీవనభృతిని పక్కనపెట్టడమే కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలుచేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆర్ముగం, సుందరరెడ్డి, తిరుమలరెడ్డి, వాసుమొదలి, రమేష్, పులికాట్ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర, తమిళనాడు అధ్యక్షుడు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన వైసీపీ నాయకులు



పెళ్లకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్‌ను ఎస్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, పెళ్లకూరు మండల జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు గురువారం తాడేపల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వైసీపీ నాయకులు కరణం రఘునాయుడు, కట్టా బాలసుబ్రహ్మణ్యం తదితరులను జగన్‌కు పరిచయం చేశారు.

ట్రాక్టరుతో డ్రమ్ సీడర్ వరి సాగు



పరిశీలిస్తున్న రమణ, నాగర్జునసాగర్

వెంకటగిరిటౌన్, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): ట్రాక్టరుతో పనిచేసే డ్రమ్ సీడర్‌తో వరి విత్తడాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖ అధిపతి డాక్టర్ సి.రమణ, ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని యాచసముద్రంలో రైతు సుబ్రహ్మణ్యం పొలంలో నిర్వహించిన డ్రమ్ సీడర్‌తో విత్తనాలు నాటే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. డ్రమ్ సీడర్‌తో సాగు చేపట్టడం ద్వారా కూలీల సమస్య అధిగమించవచ్చున్నారు. ఏవో సుజాత, రామ్మోహన్, సుమతి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ లక్ష్యంతో ముందుకెళ్లాలి

సూళ్లూరుపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ లక్ష్యంతో ముందుకెళ్లితే ఏదైనా సాధించవచ్చునని శ్రీసిటీ క్రియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సురేష్ అన్నారు. గురువారం స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో క్రమ శిక్షణ కూడా ఎంతో అవసరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌టీ శంకర్‌శర్మ, శ్రీసిటీ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు తొలగిన అడ్డంకులు



తహసీల్దారు నుంచి ఇసుక అనుమతి లెటర్‌ను అందుకుంటున్న సర్పంచ్ శ్రీనివాసన్

తడ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం, పెరియవట్టు పంచాయతీలకు ఇసుక రవాణాకు అడ్డంకులు తొలగిపోయాయి. మూడేళ్లుగా ఈ రెండు పంచాయతీల్లోని గ్రామాలకు ఇసుక రవాణాను తమిళనాడు పోలీసులు అడ్డుకొంటున్న విషయం తెలిసిందే. ఇసుక ఆయా గ్రామాలకు వెళ్లాలంటే తమిళనాడులోని ఆరంబాకం దాటి వెళ్లాల్సి ఉంది. ఆరంబాకం పోలీసులు అడ్డుకుని కేసులు నమోదు చేస్తుండటంతో అప్పటి నుంచి ఇసుక రవాణా ఆ గ్రామాలకు కష్టతరంగా మారింది. కొద్ది రోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్ రామాపురం పర్యటనకురాగా గ్రామస్థులు ఈ సమస్యను వివరించడంతో ఆయన తిరువళ్లూరు జిల్లా కలెక్టర్‌తో సంప్రదింపులు జరిపారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో గురువారం రామాపురం గ్రామస్థులు జాతీయ రహదారిపై ధర్నాకు సిద్ధమయ్యారు. దీంతో తమిళనాడు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గుమ్మిడిపూడి డీఎస్పీ లక్ష్మీప్రియ, ఇన్‌స్పెక్టర్ వడివేలు మృగన్, తహసీల్దార్ సెల్వరాణిల అధికార బృందం, స్థానిక తహసీల్దారు శరత్‌బాబు, రామాపురం గ్రామస్థులతో సంప్రదింపులు జరిపారు. తహసీల్దారు నుంచి అనుమతి ప్రతంతో ఇసుక రవాణాకు సదరు తమిళనాడు అధికారులు ఓకే చెప్పడంతో సమస్యకు పరిష్కారం దొరికింది. దీంతో గ్రామస్థులు ధర్నా నిర్వహించలేదు. ఆ మేరకు తహసీల్దారు అనుమతులు ఇస్తూ రాతపూర్వక ఆదేశాలను ఇవ్వడంతో వాటిని రామాపురం సర్పంచ్ టీకే శ్రీనివాసన్ తీసుకొని తమిళనాడు అధికారులకు అందజేశారు. దీంతో శుక్రవారం నుంచి ఆయా గ్రామాలకు ఇసుక రవాణా జరుగుతుందని, ఉన్న అడ్డంకులు అన్ని తొలగిపోయాయని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు.